thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Karimnagar, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 29 | కరీంనగర్ | గురువారం | 16 ఏప్రిల్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

చెలరేగిన చెన్నై



11

## అమెరికాకు ఇరాన్ భారీ 'బిల్'!



- రూ. 25 లక్షల కోట్ల పరిహారం ఇస్తేనే శాంతి చర్చలు.. తెగేసి చెప్పిన టెహ్రాన్
- యుద్ధ నష్టం పూడ్చాల్సిందేనన్న ఇరాన్..
- హోర్ముజ్ జలసంధిపై పన్ను విధింపు యోచన

.. వివరాలు 4లో



## కాల్పుల విరమణ గడువు పొడిగించే ఛాన్స్ లేదు

- శాశ్వతమైన ఒప్పందం వైపే మొగ్గు చూపుతున్నాం
- ట్రంప్ మరోమారు కీలక వ్యాఖ్యలు



### పాటలే తెలుసు స్కామ్‌లు తెలియవు

మీడియా ముందు సింగర్ మంగ్లీ ఆవేదన తప్పు చేస్తే ఏ శిక్షకైనా సిద్ధమని వెల్లడి ఐదుగురు వ్యక్తులపై డీజీపీకి ఫిర్యాదు

.. వివరాలు 2లో



### ప్రాతినిధ్యం తగ్గితే సహించం

- డీలిమిటేషన్‌తో దక్షిణాదికి అన్యాయం జరిగితే ప్రజా ఉద్యమం తప్పదు
- కేంద్ర ప్రభుత్వానికి కేటీఆర్ హెచ్చరిక

.. వివరాలు 3లో

# మహిళా బిల్లుకు సై.. డీలిమిటేషన్‌కు నై!



### కేంద్రం కుట్రలను అడ్డుకుంటాం

**ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే**

- రిజర్వేషన్ల ముసుగులో రాజకీయ కుతంత్రం..
- ఇండియా కూటమి కీలక భేటీ
- జనాభా లెక్కలు లేకుండా పునర్విభజన ఎలా?
- పార్లమెంటులో ఐక్య పోరాటానికి పిలుపు
- నేటి నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు..
- ఉభయ సభల్లోనూ సెగలు రేపనున్న బిల్లుల సవరణ

### నేటి నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

- మహిళా బిల్లు, డీలిమిటేషన్‌పై చర్చ
- ప్రభుత్వ తీరుపై విపక్షాల అసహనం
- వాడీవేడిగా సాగనున్న సమావేశాలు

4



పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లులపై ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ తన వ్యూహాన్ని ఖరారు చేసింది. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు బేషరతుగా మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించిన కాంగ్రెస్, అదే సమయంలో డీలిమిటేషన్ బిల్లును మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టం చేసింది.

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:** పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న మహిళా రిజర్వేషన్ల బిల్లు, డీలిమిటేషన్ బిల్లుపై కాంగ్రెస్ సంచలన నిర్ణయం తీసుకుంది. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు తెలిపిన కాంగ్రెస్.. డీలిమిటేషన్ బిల్లును మాత్రం వ్యతిరేకిస్తామని ప్రకటించింది. కాగా, దేశవ్యాప్తంగా నియోజక వర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులకు రంగం సిద్ధమైంది. ఈ రెండు బిల్లులను ఏప్రిల్ 16 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు కేంద్రం రెడీ అయింది. ఈ క్రమంలో పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలు, బిల్లులకు మద్దతు ఇవ్వాలా వద్దా అనే అంశంపై చర్చించేందుకు కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి బుధవారంఢిల్లీలోని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే నివాసంలో భేటీ అయ్యింది. దాదాపు రెండు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో

మిగతా 2 లో



## భగభగమంటున్న భానుడు

**43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు**

పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్
మరో మూడు రోజులు వడగాల్పుల తీవ్రత
44 డిగ్రీలకు చేరనున్న ఎండల వేడి
అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక

తెలంగాణలో భానుడు భగభగమంటున్నాడు. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఎండలు 43 డిగ్రీలు దాటాయి. వాతావరణ కేంద్రం హైదరాబాద్ సహా పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రానున్న మూడు రోజుల్లో వడగాల్పుల తీవ్రత పెరిగి ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలకు చేరే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. ఈ మేరకు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది.

వివరాలు 2లో

### మీసేవ కేంద్రాలపై ఏసీబీ మెరుపు దాడులు

- అదనపు వసూళ్ల ఫిర్యాదుతో అధికారుల తనిఖీలు
- భైరతాబాద్, అంబర్‌పేట, అల్వాల్‌లో సోదాలు



2

## పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

పులిగుండాలను ఉత్తమ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

మంత్రి పొంగులేటి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

3





### మహిళా సాధికారతకు మోదీ పెద్దపీట

- నారీ శక్తి వందన్ బిల్లుతో చారిత్రాత్మక మార్పులు
- వరంగల్ అభివృద్ధిపై రామచందర్ రావు ప్రశంసలు

.. వివరాలు 3లో

### ఏసీబీ వలలో హుజూరాబాద్ మున్సిపల్ ఏఈ

- రూ. 50 వేల లంచం తీసుకుంటూ దొరికిపోయిన సుధాకర్ రెడ్డి

.. 2లో

## భూసేకరణకు వ్యతిరేకంగా నిరసన

- జాగృతి అధ్యక్షురాలు కవిత అరెస్ట్
- బలవంతపు సేకరణను అడ్డుకుంటామని స్పష్టీకరణ
- వికారాబాద్‌లో రైతులతో కలిసి కవిత బైఠాయింపు
- పారిశ్రామికీకరణ ముసుగులో భూదోపిడీ అని విమర్శ
- ఉదయం నుంచి నిరసనలతో హోరెత్తిన వీధులు

3





### మహిళా రిజర్వేషన్లపై కుట్రలు సాగవు

తెలంగాణ రాష్ట్ర హక్కుల కోసం తన గొంతు వినిపిస్తున్నానని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కే. లక్ష్మణ్ తెలిపారు. తెలంగాణ కోసం సీఎం రేవంత్ రెడ్డి ఏం చేశారని ఆయన ప్రశ్నించారు. తుపాకీ పట్టుకొని ఆయన ఎవరి పక్కన నిలుచున్నారో అందరికీ తెలుసని వ్యాఖ్యానించారు.

- రాహుల్ కేరళ పోటీపై సీఎం సమాధానం చెప్పాలి
- రేవంత్ తీరుపై ఎంపీ లక్ష్మణ్ ఆగ్రహం

2



# మీసేవ కేంద్రాలపై ఏసీబీ మెరుపు దాడులు

**అదనపు వసూళ్ల ఫిర్యాదులతో అధికారుల తనిఖీలు**

**ఖైరతాబాద్, అంబర్‌పేట, అల్వాల్‌లో సోదాలు**

**హైదరాబాద్, ఏప్రిల్ 15:** తెలంగాణవ్యాప్తంగా మీసేవ కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు నిర్వహిస్తోంది. ఖైరతాబాద్, అంబర్‌పేట, అల్వాల్‌లోని మీసేవ కేంద్రాల్లో ఏసీబీ అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. పౌర సేవల పత్రాల జారీలో దళారుల ద్వారా సిబ్బంది భారీగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఏసీబీ రంగంలోకి దిగింది. సోదాల్లో భాగంగా మీసేవ సిబ్బంది ప్రజల నుంచి నిబంధనలకు విరుద్ధంగా నగదు వసూలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ సోదాలకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మీసేవ కేంద్రాల్లో దోపిడీ ఎక్కువైపోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సర్వీస్ ఛార్జీల పేరుతో సిబ్బంది చేస్తున్న దోపిడీకి అడ్డుఅదుపు లేకుండా పోయిందని జనం ఆరోపిస్తున్నారు. కుల, ఆదాయ, నివాస, జనన, మరణ ధృవీకరణ పత్రాల కోసం వెళ్తే సామాన్యులను నిలువునా దోచుకుంటున్నారు. సాంకేతికతతో పౌర సేవలను సులభతరం చేస్తున్నామని చెప్తున్న పాలకులు.. అన్ని సేవలను మీసేవ కేంద్రాలకు అప్పగించి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో నిర్వాహకులు అందినకాడికి దండుకుంటున్నారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యుల ధృవీకరణ, ఓబీసీ పత్రాల కోసం 45 రూపాయలు చెల్లిస్తే సరిపోతుంది. కానీ ఈ ఫీజు ఎక్కడా అమలు కావడం లేదు. ఒక్కో పత్రానికి 500 నుండి 1000 రూపాయల వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దరఖాస్తు చేసేటప్పుడే కాకుండా సర్టిఫికెట్లు ప్రింట్ తీసుకునే సమయంలో కూడా అదనంగా నగదు వసూలు చేస్తున్నారు. అఫిడవిట్లు సమర్పించాలనే నిబంధనలను సాకుగా చూపి వందల్లో దండుకుంటున్నారు. మీసేవ కేంద్రాల్లో తప్పనిసరిగా ధరల పట్టిక ఏర్పాటు చేయాల్సి ఉన్నా చాలా చోట్ల అది కనిపించడం లేదు. అదనపు వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. బాధితులు డయల్ 1100 లేదా 18004251110 నంబర్లకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# ఏసీబీ వలలో మున్సిపల్ ఏఈ

**రూ. 50 వేల లంచం తీసుకుంటూ దొరికిపోయిన సుధాకర్ రెడ్డి**

**ఎం-బుక్ లో నమోదు కోసం కాంట్రాక్టర్ నుంచి వసూళ్లు**



**కరీంనగర్, ఏప్రిల్ 15:** హుజూరాబాద్ మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) సుధాకర్ రెడ్డి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. పట్టణంలో నిర్మించిన స్టోర్మ్ వాటర్ డ్రైనేజీ పనుల ఫైనల్ బిల్లులను మెజర్మెంట్ బుక్ (ఎం-బుక్) లో నమోదు చేసేందుకు ఒక కాంట్రాక్టర్ నుంచి రూ. 50 వేలు లంచం డిమాండ్ చేశారు. బుధవారం హుజూరాబాద్ ఆర్టీసీ డిపో చౌరస్తా వద్ద సంతోష్ కుమార్ అనే కాంట్రాక్టర్ నుంచి ఈ నగదు తీసుకుంటుండగా అధికారులు ఆయన్ను పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. హుజూరాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఏఈగా పనిచేస్తున్న సుధాకర్ రెడ్డి ఫైనల్ బిల్లుల ప్రక్రియ పూర్తి చేయాలంటే డబ్బులు ఇవ్వాలని కాంట్రాక్టర్‌ను వేధించారు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. పక్కా ప్రణాళికతో దాడులు నిర్వహించిన అధికారులు ఏఈని పట్టుకొని ఆయన వద్ద నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. వాటర్ డ్రైనేజీ పనులకు సంబంధించిన బిల్లుల మంజూరు విషయంలో ఈ అవినీతికి పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. నిందితుడు సుధాకర్ రెడ్డిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. తదుపరి విచారణ నిమిత్తం ఆయన్ను కరీంనగర్ ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పనుల బిల్లుల మంజూరు కోసం లంచం ఆశించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు. ఈ దాడుల్లో ఏసీబీ డీఎస్పీతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# హనుమాన్ మాల ధరించిన విద్యార్థికి అవమానం

**హెడ్మాస్టర్ తీరుపై తల్లిదండ్రుల ఆగ్రహం**



**జయశంకర్ భూపాలపల్లి, ఏప్రిల్ 15:** హనుమాన్ మాలలో వచ్చిన విద్యార్థిని పాఠశాలలోకి అనుమతించకపోవడంపై తల్లిదండ్రులు మండిపడుతున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఓ పాఠశాలలో ఈ ఘటన చోటు చేసుకుంది. 7వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థి హనుమాన్ దీక్ష తీసుకున్నాడు. దీంతో హనుమాన్ మాల ధరించి పాఠశాలకు వెళ్లాడు. అయితే పాఠశాల హెడ్ మాస్టర్ ఆ విద్యార్థిని గేటు వద్దే అడ్డుకున్నారు. మాల ధరించి తరగతి గదిలోకి రాకూడదని చెప్పారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు అక్కడికి చేరుకున్నారు. హెడ్ మాస్టర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ విద్యార్థి తల్లిదండ్రులు, బజరంగదళ్ కార్యకర్తలు.. పాఠశాల ముందు ఆందోళన చేపట్టారు. పాఠశాల ప్రాంగణంలో నినాదాలు చేస్తూ భైఠాయించారు. హిందూ ఆచారాలను అవమానించిన హెడ్ మాస్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# మహిళా బిల్లుకు సై.. డీలిమిటేషన్‌కు నై!

మొదటి పేజీ తరువాయి



కూటమి నేతలు వివిధ అంశాలపై చర్చించారు. ఈ భేటీ అనంతరం ఖర్గే మీడియాతో మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ మద్దతు ఇస్తుందని తెలిపారు. మహిళా రిజర్వేషన్లపై అనాడైనా ఇనాడైనా కాంగ్రెస్‌ది ఒకటే స్టాండ్ అని పేర్కొన్నారు. డీలిమిటేషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేస్తోన్న ట్రిక్కులకు వ్యతిరేకమని.. మహిళా రిజర్వేషన్లు అంటూ దొంగ దారిలో డీలిమిటేషన్ అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. డీలిమిటేషన్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని.. పార్లమెంట్‌లో ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటేస్తామని కాంగ్రెస్ పార్టీ వైఖరిని తెలియజేశారు. డీలిమిటేషన్‌పై ఇండియా కూటమి పార్టీలు ఏకతాటిపై ఉన్నాయని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసమే హడావుడిగా కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లులను ప్రవేశ పెడుతోందని ఆరోపించారు. డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా పార్లమెంట్ లో సమిష్టిగా పోరాడుతామని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఇండియా కూటమి అనుకూలంగానే ఉందని.. కానీ దానిని తీసుకువచ్చే విధానంపైనే అభ్యంతరాలు ఉన్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే పేర్కొన్నారు. రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్‌ను ముడిపెట్టి కేంద్రం రాజకీయ కుతంత్రాలు చేస్తోందని ఆరోపించారు. రాజ్యాంగం లోని అధికారాలన్నింటినీ కార్యనిర్వాహక వర్గం తీసుకుంటోందన్నారు. కేవలం ప్రతిపక్ష పార్టీలను అణచివేయడానికే కేంద్ర ప్రభుత్వం ఇలా చేస్తోందన్నారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు వ్యతిరేకంగా తామంతా పార్లమెంట్‌లో ఐక్యంగా పోరాడుతామని ఖర్గే పేర్కొన్నారు. కనీసం జనగణన కూడా పూర్తి చేయకుండా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని విమర్శించారు. కొత్త జనాభా లెక్కల తర్వాతే డీలిమిటేషన్ చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని 2029 ఎన్నికల నుంచి అమలు చేసేందుకు 16వ తేదీ నుంచి 3 రోజులపాటు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో సవరణలను చేపట్టనున్నారు. ఇందులో భాగంగా మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి వీలుగా ఇప్పుడున్న లోక్‌సభ స్థానాల గరిష్ఠ సంఖ్య (550)ని గరిష్ఠంగా 850 వరకూ పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ క్రమంలోనే మహిళా రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్‌తో ముడిపెట్టడాన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి.

# భగభగమంటున్న భానుడు

- రాష్ట్రవ్యాప్తంగా 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్
- మరో మూడు రోజులు వడగాల్పుల తీవ్రత
- 44 డిగ్రీలకు చేరనున్న ఎండల వేడి
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక



**హైదరాబాద్, ఏప్రిల్ 15:** తెలంగాణ రాష్ట్రంలో భానుడు భగభగమంటున్నాడు. పలు ప్రాంతాల్లో ఎండలు 43 డిగ్రీలు దాటాయి. వాతావరణ కేంద్రం హైదరాబాద్ సహా పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రానున్న మూడు రోజుల్లో వడగాల్పుల తీవ్రత పెరిగి ఎండలు 44 డిగ్రీలకు చేరే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన జిల్లాల్లో ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్ నగర్, నిజామాబాద్, ఖమ్మం, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి ఉన్నాయి.

**పెరగనున్న ఉష్ణోగ్రతల తీవ్రత**

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటి నమోదయ్యాయి. రాబోయే మూడు రోజుల్లో ఇవి క్రమంగా మరో ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాగల మూడు రోజులు పలు జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆయా జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల మేర నమోదయ్యే ఛాన్స్ ఉంది. నిజామాబాద్, ఖమ్మం, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాల్పులు వీస్తాయని పేర్కొంది.

**పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్**

గురువారం ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాల్పులు వీస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది. వడగాల్పులు వీచే జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. మధ్యాహ్నం వేళ భానుడి భగభగలకు జనం బెంబేలెత్తుతున్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# పాటలే తెలుసు.. స్కామ్‌లు తెలియవు

**మీడియా ముందు సింగర్ మంగ్లీ ఆవేదన**

**హైదరాబాద్:** తనకు పాటలు పాడటం తప్ప స్కామ్‌లు చేయడం తెలియదని, నిరాధార ఆరోపణలతో ఎంతో నలిగి పోతున్నానని సింగర్ మంగ్లీ ఆవేదన వ్యక్తం చేశారు. స్కామ్‌లతో తనకు సంబంధం లేదని, ఒకవేళ తప్పు చేసినట్లు రుజువైతే ఎలాంటి శిక్షకైనా సిద్ధమని స్పష్టం చేశారు. బుధవారం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ పేదరికం నుంచి వచ్చిన తనకు డబ్బు విలువ తెలుసని పేర్కొన్నారు. తప్పుడు ప్రచారం వల్ల నెల రోజులుగా రికార్డింగ్‌లు, ప్రోగ్రామ్‌లు వదులుకోవాల్సి వచ్చిందని, ప్రజల్లోకి తప్పుడు సమాచారం వెళ్తోందని వాపోయారు. తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న మధు నాయక్, హిమకాంత్ రెడ్డి, రామావత్ మధు, సిద్ధు, సుబ్బారావులపై డీజీపీకి ఫిర్యాదు చేసినట్లు మంగ్లీ వెల్లడించారు. తాను ఎప్పుడూ బాధితుల పక్షానే ఉంటానని స్పష్టం చేశారు. ఆమె న్యాయవాది మాట్లాడుతూ స్కామ్ చేసిన వారే బాధితుల రూపంలో మీడియా ముందుకు వస్తున్నారని ఆరోపించారు. 'సుభక్షేత్ర బిజినెస్' అనే పేరుతో కంపెనీ ఏర్పాటు చేసి కుంభకోణానికి పాల్పడింది మధు అని, ప్రస్తుతం బాధితుడిగా మాట్లాడుతున్న హిమకాంత్ రెడ్డి ఆ కంపెనీకి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేశారని న్యాయవాది వివరించారు. ఈ స్కామ్‌తో మంగ్లీకి ఎటువంటి సంబంధం లేదని, అసలైన నిందితులను వదిలేసి ఆమెను బలిపశువును చేస్తున్నారని మండిపడ్డారు. నిందితుల అసలు రంగు బయటపడాలని డిమాండ్ చేశారు.

# పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

**పులిగుండాలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి**



**పెనుబల్లి, ఏప్రిల్ 15:** పెనుబల్లి మండలం బ్రాహ్మళ్లకుంట పరిధిలోని పులిగుండాల ఎకో టూరిజం ప్రాజెక్టును బుధవారం రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించారు. జంగిల్ సఫారీ, బోటింగ్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చి ప్రకృతి ఒడిలో కాసేపు విహరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అపురూపమైన ప్రకృతి సంపదను ప్రపంచానికి పరిచయం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. పులిగుండాలను రాష్ట్రంలోని మొదటి మూడు ఉత్తమ పర్యాటక కేంద్రాలలో ఒకటిగా నిలబెడతామని మంత్రి హామీ ఇచ్చారు. పర్యాటకుల సౌకర్యార్థం ఇక్కడికి వెళ్లే మార్గాన్ని వెంటనే డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు అనుమతులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కనకగిరి హిల్స్ అభివృద్ధికి తక్షణమే కార్యాచరణ ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యే విన్నపం మేరకు సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నుంచి పులిగుండాలకు నీటిని మళ్లించే సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేస్తామని తెలిపారు. నీటి మళ్లింపు ద్వారా వేసవిలోనూ ఈ ప్రాంతం జలకళతో ఉంటుందని, పర్యాటక అభివృద్ధి వల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పొంగులేటి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, పీసీసీఎఫ్ సువర్ణ, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. వీరితో పాటు సీపీ సునీల్ దత్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నాయుడు సత్యనారాయణ హాజరయ్యారు.

# మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధికి కట్టుదిట్టమైన చర్యలు

**జీరో బిజినెస్ అంశంపై మంత్రి తుమ్మల ఆగ్రహం**

**మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో సమీక్ష**

**హైదరాబాద్, ఏప్రిల్ 15:** తెలంగాణలో వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధి, పారదర్శకతపై కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధి పనుల పురోగతి, రైతులకు అందుతున్న సౌకర్యాలపై ఆయన అధికారులతో చర్చించారు. గత రెండు సంవత్సరాల్లో మొత్తం రూ.568.50 కోట్ల వ్యయంతో 630 అభివృద్ధి పనులు మంజూరు చేసినట్లు మంత్రికి అధికారులు వెల్లడించారు. ఇందులో రూ.128 కోట్లతో 113 పనులు పూర్తయ్యాయని నివేదిక సమర్పించారు. మిగిలిన పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. ప్రతి పనికి టైమ్‌లైన్ నిర్ణయించి వేగంగా ముందుకు తీసుకెళ్లాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. మార్కెట్ యార్డుల్లో 'జీరో బిజినెస్' అంశంపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాపారం చేయకుండా లైసెన్సులు కొనసాగిస్తున్న ట్రేడర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారి లైసెన్సులను రద్దు చేయాలని ఆదేశించారు. అలాంటి వారికి సహకరించే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. అభివృద్ధి పనుల పర్యవేక్షణ కోసం ప్రత్యేక డ్యాష్‌బోర్డ్ ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, పంట ఉత్పత్తుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు తుమ్మల. గడ్డిఅన్నారం మార్కెట్‌లో 'స్మార్ట్ మార్కెట్ యార్డ్' అమలు చేయాలని, డిజిటలైజేషన్ ద్వారా జీరో బిజినెస్ సమస్యను తగ్గించాలని నిర్ణయించారు. కోహెడ మార్కెట్ అభివృద్ధి పనులకు త్వరలో టెండర్లు పిలవనున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ ఖర్చు తగ్గింపుపైనా మంత్రి దృష్టి సారించారు. మార్కెట్ యార్డుల్లో సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టులను వేగవంతం చేసి, జులై చివరి నాటికి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాలని అన్నారు. వ్యవసాయ కొనుగోళ్ల విషయానికి వస్తే.. ఖరీఫ్ సీజన్‌లో పత్తి కొనుగోళ్లు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లకు మిర్చి అధికంగా వస్తోందని పేర్కొన్నారు. మరోవైపు ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. టార్పాలిన్లు, తేమ కొలమానాలు, డ్రైయర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. మొక్కజొన్న కొనుగోళ్లలోనూ రైతులకు పూర్తి రక్షణ కల్పిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. అలాగే రైతుల ఖాతాలకు నేరుగా చెల్లింపులు చేస్తామని స్పష్టం చేశారు. మొత్తం మీద మార్కెట్ యార్డ్‌లను ఆధునీకరించి, రైతులకు అనుకూలంగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తుమ్మల వెల్లడించారు.



# భూసేకరణకు వ్యతిరేకంగా నిరసన

- జాగృతి అధ్యక్షురాలు కవిత అరెస్ట్
- సేకరణను అడ్డుకుంటామని స్పష్టీకరణ
- పారిశ్రామికీకరణ ముసుగులో భూదోపిడీ
- వికారాబాద్‌లో రైతులతో కలిసి బైఠాయింపు




**వికారాబాద్, ఏప్రిల్ 15:** పరిగి పారిశ్రామిక కారిడార్ కోసం చేపట్టిన భూసేకరణకు వ్యతిరేకంగా వికారాబాద్‌లో నిరసన చేపట్టిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను పోలీసులు అరెస్ట్ చేశారు. పారిశ్రామిక కారిడార్ పేరిట రైతుల భూములను బలవంతంగా సేకరించడాన్ని నిరసిస్తూ ఆమె బుధవారం ఉదయం నుంచి ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో రైతులతో కలిసి వికారాబాద్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పారిశ్రామికీకరణ ముసుగులో ప్రభుత్వం రైతుల పొట్ట కొడుతోందని కవిత ఆరోపించారు. భూసేకరణ నిలిపివేయకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తక్షణమే భూసేకరణ నోటిఫికేషన్ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకుముందు స్థానిక ఎన్టీఆర్ చౌరస్తాలో రైతులు భారీ ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులను అడ్డుకునే క్రమంలో పోలీసులు, నిరసనకారుల మధ్య తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు కవితతో పాటు పలువురు రైతులను అదుపులోకి తీసుకున్నారు. ఈ నిరసన కార్యక్రమానికి ధర్మ సమాజ్ పార్టీ మద్దతు ప్రకటించింది. రైతుల ప్రయోజనాల కోసం పోరాటం కొనసాగిస్తామని ఆయా పార్టీల నేతలు స్పష్టం చేశారు.

# మహిళా సాధికారతకు మోదీ పెద్దపీట

- నారీ శక్తి వందన్ బిల్లుతో చారిత్రాత్మక మార్పులు
- వరంగల్ అభివృద్ధిపై రామచందర్ రావు ప్రశంసలు



**వరంగల్, ఏప్రిల్ 15:** ప్రధాని మోదీ సుపరిపాలనలో వరంగల్‌లో మునుపెన్నడూ చూడని అపూర్వమైన అభివృద్ధి జరుగుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద వరంగల్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ జరుగుతోందని తెలిపారు. పీఎం మిత్ర టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు కాబోతుందని చెప్పారు. ఈ ప్రాంత ప్రగతికి కేంద్ర ప్రభుత్వం వేస్తున్న అడుగులే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. మహిళా రాజకీయ సాధికారతకు బాటలు వేస్తూ మోదీ సర్కార్ తీసుకొచ్చిన చారిత్రాత్మక నారీ శక్తి వందన్ అధినియం పట్ల వరంగల్ ప్రజలు అమితమైన హర్షం వ్యక్తం చేస్తున్నారని వెల్లడించారు. నరేంద్ర మోదీకి తెలంగాణ ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం వరంగల్‌లోని నారీమణులతో కలిసి చారిత్రాత్మక నారీ శక్తి వందన్ అధినియం విజయోత్సవాలను ఉత్సాహంగా జరుపుకున్నారు. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రధాని మోదీ తీసుకున్న ఈ నిర్ణయం.. నవ భారత రాజకీయ ముఖచిత్రాన్ని శాశ్వతంగా మార్చబోతున్న ఒక సువర్ణాధ్యాయం అని కొనియాడారు. వరంగల్‌లో ఎర్రబెల్లి ప్రదీప్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వీధి వ్యాపారులకు టీ స్టాళ్లు పంపిణీ చేశారు. పట్టణ ఆర్థిక వ్యవస్థలో, ప్రజలకు నిత్యావసరాలను వారి ముంగిటకే చేరువ చేయడంలో వీధి వ్యాపారుల పాత్ర అత్యంత కీలకం అని పేర్కొన్నారు. వీరి కష్టాన్ని గుర్తించిన మోదీ పీఎం స్వనిధి పథకం ద్వారా వారి జీవనోపాధికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని చెప్పారు. ఈ పథకం కింద వరంగల్ అత్యధిక లబ్ధి పొందడం.. పేదలు, శ్రమజీవులు, చిరు వ్యాపారుల సంక్షేమం పట్ల మోదీ ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనం అని అన్నారు. వరంగల్ పర్యటన నిమిత్తం విచ్చేసిన అధ్యక్షుడికి బీజేపీ కార్యకర్తలు ఆత్మీయ స్వాగతం పలికారు. ప్రతి బీజేపీ కార్యకర్త హృదయంలో వరంగల్‌కు ఒక ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. 1984లో దేశవ్యాప్తంగా పార్టీ కేవలం రెండు స్థానాలు గెలుచుకున్నప్పుడు, అందులో ఒక చారిత్రాత్మక విజయం వరంగల్ గడ్డపై జంగారెడ్డి రూపంలో నమోదైందని గుర్తుచేశారు. ఆనాటి ఆ చారిత్రక ఘట్టం నేటికీ తరతరాల కార్యకర్తలకు స్ఫూర్తినిస్తూనే ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో కమల వికాసానికి, పార్టీని మరింత విస్తరించాలనే దృఢ సంకల్పాన్ని ఇది మరింత బలపరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



# వారసత్వ కట్టడాలను పరిరక్షించాలి

**పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలి**

**కుతుబ్‌షాహి టూంబ్స్ తదితర కట్టడాలను పరిశీలించిన జూపల్లి**



**హైదరాబాద్, ఏప్రిల్ 15:** కుతుబ్ షాహీ టూంబ్స్‌లోని ఇంటర్ప్రిటేషన్ సెంటర్‌లో జరుగుతున్న పనులను పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. సెవెన్ టూంబ్స్ కటోరా హౌస్, కేబీ మ్యూజియంను ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ తో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వక్ఫ్ ట్రిబ్యునల్ లో కేసు పెండింగ్ గురించి చర్చించారు. కేసు పూర్వాపరాలను గురించి వివరించారు. ట్రిబ్యునల్ పరిధిలో పెండింగ్ లో ఉన్న పనులను మినహాయించి, మిగిలిన పనులను వారంలోగా ప్రారంభించి, వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కుతుబ్ షాహి టూంబ్స్ నుంచి గోల్కొండ కోట వరకు 1.3 కిలోమీటర్ల రోప్ వే నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు ఏ స్థాయిలో ఉన్నాయని ఆరా తీశారు. క్లియరెన్స్ స్టేజిలో ఉన్నాయని, ఆయా శాఖల నుంచి అనుమతులు వచ్చిన వెంటనే డీపీఆర్ సిద్ధం చేస్తామని అధికారులు చెప్పారు. అనంతరం కటోరా హౌస్ ను సందర్శించారు. కులీకుతుబ్ షా అర్బన్ డెవలప్మెంట్ ఆటోఆరిటీని సమన్వయం చేసుకుని , డీపీఆర్ ను సిద్ధం చేయాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. కటోరా హౌస్ ను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. కటోరా హౌస్ పరిసర ప్రాంతాల్లో ఉన్న వ్యర్థాలను వెనువెంటనే తొలగించాలని అధికారులు ఆదేశించారు. తర్వాత గోల్కొండ కోట సమీపంలోని బస్ స్టాప్ వద్ద ఉన్న ఖాళీ ప్రదేశంలో లాడ్ బజార్ తరహాలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాన్నారు. ఈ ప్రతిపాదనలను నేషనల్ మోనుమెంట్ మిషన్ అథారిటీకి పంపి అనుమతులు పొందాలని సూచించారు. అక్కడి నుంచి ఖజానా బిల్డింగ్ మ్యూజియంకు చేరుకున్నారు. ఎంతో చారిత్రాత్మక విలువైన కళాఖండాలు ఉన్న ఈ మ్యూజియం ను పర్యాటకంగా అభివృద్ధి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ ప్రదేశంలో చేనేత వస్త్రాల ప్రదర్శన ను ఏర్పాటు చేయాలని పురావస్తు , అధికారులను ఆదేశించారు. కేబీ మ్యూజియం వెనక భాగంలో ఉన్న ఆక్రమణలను పోలీస్ శాఖ సహకారంతో వారం రోజుల్లో తొలగించాలని అన్నారు. ౹÷లంగాణలో అద్భుతమైన చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపద, ప్రకృతి రమణీయ ప్రదేశాలు ఉన్నాయని, వాటిని ప్రపంచ పర్యాటకులకు పరిచయం చేసేలా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా వాటిని అభివృద్ధి చేయడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజీటీడీసీ ఎండీ గౌతమి, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున రావు, ఇతర శాలల అధికారులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ కేసు విచారణలో రోజుకో కొత్త కోణం

**కేదార్‌తో పైలట్ రోహిత్ రెడ్డి సోదరులకు ఆర్థిక బంధం**

**హైదరాబాద్, ఏప్రిల్ 15:** మొయినాబాద్ డ్రగ్స్ కేసు విచారణలో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. తాజాగా, ఈ కేసులో కేదార్ అనే వ్యక్తి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. గత ఏడాది దుబాయ్‌లో డ్రగ్స్ ఓవర్ డోస్ కారణంగా మ-రణించిన కేదార్‌తో పైలట్ రోహిత్ రెడ్డి సోదరులకు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. రరోహిత్ రెడ్డి, ఆయన సోదరుడు రితేష్ రెడ్డి, కేదార్‌కు మధ్య భారీ ఎత్తున ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు పోలీసుల విచారణలో తేలింది. ముఖ్యంగా రోహిత్, రితేష్ బ్యాంక్ ఖాతా నుంచి కేదార్‌కు రూ.25 లక్షలు బదిలీ అయినట్లు పోలీసులు పక్కా ఆధారాలు సేకరించారు. ఈ ఆర్థిక లావాదేవీల గురించి రోహిత్ రెడ్డి, రితేష్‌ని ప్రశ్నించగా ఇద్దరూ పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని, వారు విచారణకు సహకరించడం లేదని పోలీసులు పిటిషన్‌లో పేర్కొన్నారు. మరిన్ని విషయాలు రాబట్టడానికి కస్టడీని పొడిగించాల్సిన అవసరం ఉందని పోలీసులు తమ నివేదికలో స్పష్టం చేశారు.





# మహిళా రిజర్వేషన్లపై కుట్రలు సాగవు

- రాహుల్ కేరళ పోటీపై సీఎం సమాధానం చెప్పాలి
- రేవంత్ తీరుపై ఎంపీ లక్ష్మణ్ ఆగ్రహం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:** తెలంగాణ రాష్ట్ర హక్కుల కోసం తన గొంతు వినిపిస్తున్నానని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కే. లక్ష్మణ్ తెలిపారు. తెలంగాణ కోసం సీఎం రేవంత్ రెడ్డి ఏం చేశారని ఆయన ప్రశ్నించారు. తుపాకీ పట్టుకొని ఆయన ఎవరి పక్కన నిలుచున్నారో అందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అగ్రనేత ఎంపీ రాహుల్ గాంధీ కేరళ నుంచి ఎందుకు పోటీ చేశారో రేవంత్ రెడ్డి చెప్పాలని ఆయన నిలదీశారు. యూపీ నుంచి రాజ్యసభకు ఎన్నిక కావడం తెలుగువాడిగా తనకు గౌరవమని లక్ష్మణ్ పేర్కొన్నారు. తనపై సీఎం చేసిన వ్యాఖ్యలపై బుధవారం న్యూఢిల్లీలో లక్ష్మణ్ స్పందించారు. నీతులు చెబుతున్నారంటూ రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. మహిళల అవకాశాలను దెబ్బతీయడానికి ప్రతిపక్షాలు కుట్ర పన్నుతున్నాయని లక్ష్మణ్ మండిపడ్డారు. మహిళల వాటా తగ్గించడానికి ప్రయత్నిస్తున్నారా? ఎస్సీ, ఎస్టీ వాటా అడ్డుకోవడానికి కుట్రలు చేస్తున్నారా? అంటూ నిలదీశారు. రేవంత్ రెడ్డికి ప్రజాస్వామ్యం అంటే డబ్బేనని ఎద్దేవా చేశారు. ఢిల్లీకి ఆయన డబ్బుల మూటలు మోశారని విమర్శించారు. నగదు కేంద్రంగా రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బున్న వాళ్లకే ఓటు విలువ ఎక్కువ అనేలా రేవంత్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని లక్ష్మణ్ పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌ను మూడు ముక్కలు చేశారని లక్ష్మణ్ మండిపడ్డారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో 150 సీట్లను 300 సీట్లు చేశారని తెలిపారు. ఏ శాస్త్రీయ పద్ధతిలో గ్రేటర్ హైదరాబాద్‌ను విభజించారని సీఎంను సూటిగా ప్రశ్నించారు. డీలిమిటేషన్ బిల్లు వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగకుండా ప్రస్తుతం ఉన్న సీట్ల నిష్పత్తికి అనుగుణంగా అవి పెరుగుతాయని చెప్పారు. 543 సీట్లలో మహిళా రిజర్వేషన్లు పెంచమనడం వెనుక ఎస్సీ, ఎస్టీ మహిళలకు నష్టం చేయాలనే కుట్ర దాగి ఉందని అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీకి పెరుగుతున్న ఆదరణ చూసి జీర్ణించుకోలేక పోతున్నారంటూ రేవంత్ రెడ్డిపై ధ్వజమెత్తారు. అందుకే డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లుల పట్ల రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. జీఎస్‌డీపీ ప్రకారం డీలిమిటేషన్ చేయాలనేది కాంగ్రెస్ విధానమా? అనేది స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఓటు విలువ ధనిక, పేద అనే వ్యత్యాసం లేకుండా అందరికీ సమానంగా ఉంటుందని అన్నారు. జీడీపీలో మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు ముందు వరుసలో ఉన్నాయని గుర్తు చేశారు. తెలంగాణ వ్యతిరేక ప్రతిపాదనలు చేస్తున్నారని, వెంటనే వీటిని వెనక్కి తీసుకోవాలని రేవంత్ రెడ్డికి స్పష్టం చేశారు.


# ప్రాతినిధ్యం తగ్గితే సహించం

**డీలిమిటేషన్‌తో దక్షిణాదికి అన్యాయం జరిగితే ప్రజా ఉద్యమం తప్పదు**

**కేంద్ర ప్రభుత్వానికి కేటీఆర్ తీవ్ర హెచ్చరిక**



**హైదరాబాద్, ఏప్రిల్ 15 :** నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కేంద్ర ప్రభుత్వానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక జారీ చేశారు. దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గేలా డిలిమిటేషన్ జరిగితే అది కేవలం ఒక రాజకీయ ప్రక్రియగానో లేక చట్టసవరణగానో మిగిలిపోదని అన్నారు. మొత్తం దక్షిణ భారతదేశం అంతటా ఒక బలమైన ప్రజా ఉద్యమానికి దారితీస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో బీఆర్ఎస్ పార్టీ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని తేల్చి చెప్పారు. మూడేళ్ల క్రితం తాము తీసుకున్న దృఢమైన నిర్ణయానికే కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. తామంతా గర్వించదగ్గ భారతీయులమని, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న అత్యుత్తమ రాష్ట్రాల ప్రతినిధులమని కేటీఆర్ పేర్కొన్నారు. జనాభా నియంత్రణతో పాటు వివిధ రంగాల్లో అద్భుత ప్రగతి సాధిస్తున్న దక్షిణ రాష్ట్రాలకు, ఈ పునర్విభజన వల్ల రాజకీయంగా అన్యాయం జరగడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను ప్రోత్సహించాల్సింది పోయి, వాటి ప్రాతినిధ్యాన్ని తగ్గించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన విమర్శించారు. దేశంలోని అత్యున్నత ప్రజాస్వామ్య వేదిక అయిన పార్లమెంటులో తమ ప్రజల స్వరాన్ని, ప్రతినిధిత్వాన్ని అణిచివేయాలని చూస్తే తాము నిశ్శబ్దంగా చూస్తూ ఉండబోమని స్పష్టం చేశారు. దక్షిణ భారతీయుల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తామని కేటీఆర్ ప్రకటించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాలని అన్నారు. "ఢిల్లీ పాలకులు మా మాట వినాలి, బుద్ధి ప్రభలాలని ఆశిస్తున్నాం" అంటూ సోషల్ మీడియా ఎక్స్‌లో కేటీఆర్ పోస్ట్ చేశారు.




సంపాదకీయం

# దేశానికి దిశ చూపేలా బిల్లులపై చర్చించాలి!

చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై పలు విమర్శలు వస్తున్నాయి. పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రాజకీయ పార్టీలతో పాటు, పౌరసమాజంలోనూ అనుమానాలు ఉన్నాయి. ఈ నెల 16 నుంచి పార్లమెంట్ మూడు రోజుల పాటు ప్రత్యేకంగా సమావేశం కాబోతున్నది. అందువల్ల ఈ విషయంలో అనుమానాలు నివృత్తి చేయాల్సి ఉంది. అనుమానాలు వ్యక్తం చేస్తున్న వారు, ఆందోళనలు చేస్తున్న వారు, విమర్శలు చేస్తున్న వారి అభిప్రాయాలకు విలువనివ్వాలి. పార్లమెంట్ వేదికగా సుదీర్ఘంగా చర్చించాలి. విపక్ష, స్వపక్ష నేతలు కూడా పరస్పర వివాదాల జోలికి పోకుండా ప్రజలకు అర్థమయ్యేలా సమగ్రంగా చర్చించాలి. అఖిలపక్ష సమావేశం కన్నా పార్లమెంటులో చర్చించడమే మేలు. ఎందుకంటే ఈ చర్చకు చట్టబద్ధత ఉంటుంది. అలాగే సభ్యుల సూచనలు, సలహాలకు విలువ ఉంటుంది. ఎఐ వినియోగం, సాంకేతికత పెరిగిన ప్రస్తుత కాలంలో ఈ విషయాలపై వాటి సాయం కూడా పొందితే మంచిది. పార్లమెంటులో సుదీర్ఘ ఉపన్యాసాలకు తావులేకుండా, పరస్పర విమర్శలకు చోటు లేకుండా ఈ రెండు అంశాలపై సమగ్రంగా చర్చించాలి. దీనివల్ల ప్రజలకు కూడా అవగాహ కలిగేలా ఉండాలి. రాజకీయపార్టీలు స్వార్థ రాజకీయాలను పక్కన పెట్టి, ఈ అంశాలపై ఓ ఏకాభిప్రాయం వచ్చేలా చూడాలి. ఎందుకంటే మహిళా రిజర్వేషన్ బిల్లు ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉంది. నిజానికి మొన్నటి సార్వత్రిక ఎన్నికలకు ముందే పార్లమెంట్ ముందుకు వచ్చింది. అప్పుడే ఇది చట్టంగా మారివుంటే బాగుండేది. కొత్తగా జనాభా లెక్కల తరవాత దీనిని అమలు చేస్తామని గతంలో బిల్లు ప్రవేశ పెట్టినప్పుడు ప్రభుత్వం చెప్పింది. ఇప్పుడు 2011 జనాభా లెక్కల ప్రకారం అమలు చేస్తే అన్యాయం చేసినట్లు అవుతుంది. 2029లో సార్వత్రిక ఎన్నికలు జరిగితే ప్రజాస్వామ్యం మరింతగా వికసిస్తుందని, బలోపేతం అవుతుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. విధాన నిర్ణయాల్లో మహిళలు ఎప్పుడైతే క్రియాశీలంగా వ్యవహరిస్తారో అప్పుడు వికసిత్ భారత్ దిశగా ప్రయాణం మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని 2029 ఎన్నికల నుంచి అమలు చేసేందుకు 16వ తేదీ నుంచి 3 రోజులపాటు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో సవరణలను చేపట్టనున్న నేపథ్యంలో దేశంలోని మహిళలకు ప్రధాని ప్రత్యేకంగా లేఖ రాశారు. నిజానికి ఇప్పటికే మహిళల రిజర్వేషన్లు అమలు జరిగివుండాల్సింది. అనేక రంగాల్లో మహిళలు రాణిస్తున్నందున చట్టసభల్లోనూ వారి భాగస్వామ్యం పెరగాల్సిందే. చట్టసభల్లో వారి వాణి బలంగా వినిపిస్తే ప్రజాసామ్యం మరింత బలోపేతం అవుతుంది. అయితే లోక్‌సభ సీట్లు పెరిగితేనే మహిళల రిజర్వేషన్లు అమలు సులువవుతందని ప్రభుత్వ వాదనగా ఉంది. మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి వీలుగా ఇప్పుడున్న లోక్‌సభ స్థానాల గరిష్ఠ సంఖ్య 550ని గరిష్ఠంగా 850 వరకూ పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం 2027 జనాభా లెక్కల నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ అందుకు సంబంధించి లెక్కలు వెలువడటానికి ఆలస్యమవుతుందన్న ఉద్దేశంతోనే ముందస్తు గా ఈ రాజ్యాంగ సవరణ బిల్లులను తీసుకొస్తున్నట్లు కేంద ప్రభుత్వం పేర్కొంది. దాని ప్రకారం వెళ్తే ప్రజాస్వామ్య పక్రియలో మహిళా భాగస్వామ్యం పెంచడంలో జాప్యం జరుగుతుందని అభిప్రాయపడింది. కేంద్ర ప్రభుత్వం ఏ జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోనేదీ ఈ బిల్లులో చెప్పలేదు. అయితే డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు కోసం ప్రతిపాదించిన బిల్లులో ఆ కమిషన్ ఏర్పాటయ్యే నాటికి అందుబాటు లో ఉన్న తాజా జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాలను పునర్విభజించనున్నట్లు పేర్కొంది. అంటే దాని ప్రకారం ప్రస్తుతం అందుబాటు లో ఉన్న తాజా జనాభా లెక్కలు 2011వే కాబట్టి వాటి ప్రాతిపదికనే నియోజకవర్గాల పునర్విభజన జరిగే అవకాశముంది. 850 సీట్లను ఏ ప్రాతిపదికన పెంచబోయేదీ ఈ బిల్లులో స్పష్టత ఇవ్వకున్నా పార్లమెంటులో చర్చ సందర్భంగా ప్రభుత్వం చెప్పే అవకాశం ఉంది. అప్పుడు అన్ని రాష్ట్రాల్లో స్థానాలను 50శాతం పెంచుతామని చెబితే ఏయే రాష్ట్రాల్లో అసెంబ్లీ, పార్లమెంటు సీట్లు ఎన్ని పెరుగుతాయన్న దానిపై స్పష్టత వస్తుంది. ఆ రాష్ట్రాలకు వచ్చిన సీట్లను అంతర్గతంగా పునర్విభజించుకోవడానికి 2011 జనాభా లెక్కలు పనికొస్తాయి. అలా కాకుండా దేశం మొత్తాన్ని యూనిట్‌గా తీసుకొని 2011 జనాభా లెక్కల ఆధారంగానే పునర్విభజన చేపట్టాలని నిర్ణయిస్తే డీలిమిటేషన్ కమిషన్ అంతిమంగా నివేదిక ఇచ్చేంత వరకూ ఏ రాష్ట్రం లో ఎన్ని సీట్లు పెరుగుతాయన్న దానిపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. నియోజకవర్గాల పునర్విభజన విషయంలో కమిషన్‌కు సహాయ పడటానికి ప్రతి రాష్ట్రం నుంచి 10 మందిని నియమిస్తారు. ఇందులో ఐదుగురు ఎంపీలు, ఐదుగురు ఎమ్మెల్యేలుంటారు. లోక్‌సభ సభ్యులను లోక్‌సభ స్పీకర్, ఎమ్మెల్యేలను అసెంబ్లీ స్పీకర్ నామినేట్ చేస్తారు. నియోజకవర్గాల పునర్విభజన కోసం రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్, సర్వేయర్ జనరల్ ఆఫ్ ఇండియా, వారి నామినీలను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులను, భౌగోళిక పరిస్థితులపై అవగాహన ఉన్న నిపుణులను, ఇతరత్రా అవసరమైన వారిని పిలిచి మాట్లాడే అధికారం ఈ కమిషన్‌కు ఉంటుంది. కమిషన్ సభ్యుల్లో భిన్నాభిప్రాయాలు ఏర్పడితే మెజారిటీ సభ్యుల అభిప్రాయం చెల్లుబాటవుతుంది. డీలిమిటేషన్ బిల్లులో ఈ కమిషన్ ఏర్పాటు కావడానికి ముందు అందుబాటులో ఉన్న తాజా జనాభా లెక్కల ప్రకారం నియోజక వర్గాల పునర్విభజన జరుగుతుందని చెప్పింది తప్పితే స్పష్టంగా ఫలానా జనాభా లెక్కల ప్రాతిపదికన అని చెప్పలేదు. 2027 జనాభా లెక్కల సేకరణ జరుగుతున్న తరుణంలో 2011 జనాభా లెక్కలను ఎలా ప్రాతిపదికగా తీసుకుంటారని ప్రతిపక్షాలు ప్రశ్నించే వీలుండటంతో ఆ దాడి నుంచి తప్పించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం తెలివిగా కమిషన్ ఏర్పాటయ్యే నాటికి ముందున్న జనాభా లెక్కల ప్రకారం ఈ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పినట్లు కనిపిస్తోంది. అయితే ఇవన్నీ ఓక పజిల్‌లలాగా కనిపిస్తున్నాయి. అందువల్ల పార్లమెంట్ చర్చకు విలువ ఉంటుంది. అఖిలపక్షం కన్నా పార్లమెంటులో చేస చర్చలకే ప్రాధాన్యం ఉంటుంది. విపక్షాలకు ఉన్న అనుమానాలను తీర్చాల్సిన బాధ్యత అధికార పక్షానిది. అనుమానాలను సహేతుకంగా ప్రస్తావించడం ద్వారా విపక్షాలు తమవంతుగా కృషి చేయాలి. అప్పుడే ఈ రెండు బిల్లులపై సమగ్ర చర్చకు అవకాశం ఉంటుంది.

# అమెరికాకు ఇరాన్ భారీ 'బిల్'!

- రూ. 25 లక్షల కోట్ల పరిహారం ఇస్తేనే శాంతి చర్చలు.. తెగేసి చెప్పిన టెహ్రాన్
- యుద్ధ నష్టం పూడ్చాల్సిందేనన్న ఇరాన్.. హోర్ముజ్ జలసంధిపై పన్ను విధింపు యోచన
- అమెరికాకు సహకరించిన ఐదు అరబ్ దేశాలకూ పరిహారం సెగ!
- చమురు, వాణిజ్య రంగాల్లో తీరని లోటు.. అంతర్జాతీయ సాయం కోసం ఇరాన్ విజ్ఞప్తి



**న్యూఢిల్లీ:** మెరికాతో రెండో విడత శాంతి చర్చలకు సిద్ధమవుతున్న తరుణంలో ఇరాన్ ఒక సంచలన డిమాండ్‌ను తెరపైకి తెచ్చింది. ఇటీవల జరిగిన యుద్ధం కారణంగా తమ దేశం సర్వస్వం కోల్పోయిందని, జరిగిన నష్టానికి పరిహారంగా అమెరికా దాదాపు 270 బిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో సుమారు రూ. 25 లక్షల కోట్లు) చెల్లించాలని డిమాండ్ చేసింది. ఈ భారీ పరిహారంపై స్పష్టత వస్తేనే చర్చల్లో ముందుకు వెళ్తామని ఇరాన్ అధికారులు స్పష్టం చేశారు. యుద్ధం వల్ల జరిగిన విధ్వంసాన్ని తమ దేశం ఒంటరిగా భరించలేదని, అంతర్జాతీయ సమాజం తమకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని ఇరాన్ పేర్కొంది. యుద్ధం కారణంగా ఇరాన్‌లోని మౌలిక సదుపాయాలు, నివాస గృహాలు, రవాణా వ్యవస్థలు పూర్తిగా ఛిన్నాభిన్నమయ్యాయి. ముఖ్యంగా దేశ ఆర్థిక వెన్నెముక అయిన చమురు రంగానికి, వాణిజ్య రంగానికి జరిగిన నష్టం అంచనాలకు అందడం లేదని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నష్టాల గణన ఇంకా కొనసాగుతోందని, పరిహారం మొత్తం మరింత పెరిగే అవకాశం ఉందని టెహ్రాన్ వర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ అమెరికా నుంచి ఆశించిన స్పందన రాకపోతే, ప్రత్యామ్నాయంగా కీలకమైన హోర్ముజ్ జలసంధి ద్వారా ప్రయాణించే అంతర్జాతీయ నౌకలపై ప్రత్యేకంగా 'యుద్ధ నష్ట పన్ను' విధించే అంశాన్ని కూడా ఇరాన్ పరిశీలిస్తోంది. ఇది ప్రపంచ చమురు సరఫరాపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. మరోవైపు, యుద్ధ సమయంలో అమెరికా-ఇజ్రాయెల్ దళాలకు తమ భూభాగాలను ఉపయోగించుకోవడానికి అనుమతినిచ్చిన ఐదు అరబ్ దేశాలపై కూడా ఇరాన్ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. తమ దేశ విధ్వంసానికి పరోక్షంగా సహకరించిన ఆ దేశాలు కూడా పరిహారం చెల్లించాల్సిందేనని ఇరాన్ ఇప్పటికే డిమాండ్ చేసింది. శాంతి చర్చలకు ముందు ఇరాన్ పెట్టిన ఈ కఠిన నిబంధనలు ఇప్పుడు అగ్రరాజ్యం అమెరికాను ఇరకాటంలో పడేశాయి. ఈ పరిహారం చెల్లింపుపై అమెరికా ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో, ఇది శాంతి చర్చల భవిష్యత్తును ఎలా మారుస్తుందో అన్నది ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో ఆసక్తికరంగా మారింది.

# నేటి నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

- మహిళా బిల్లు, డీలిమిటేషన్‌పై చర్చ
- ప్రభుత్వ తీరుపై విపక్షాల అసహనం
- వాడీవేడీగా సాగనున్న సమావేశాలు




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:** పార్లమెంట్ మరో చారిత్రక నిర్ణయానికి వేదిక కాబోతున్నది. మహిళా బిల్లు, డీలిమిటేషన్ బిల్లు ఆమోదం కోసం ఉభయ సభలు గురువారం నుంచి మూడ్రోజులు సమావేశం కాబోతున్నా యి. మహిళా బిల్లును ఇప్పటికే ఆమోదంచారు. 2026 జనాభా లెక్కల మేరకు సీట్లు కేటాయిస్తామని ప్రకటించారు. అయితే ఇప్పుడు 2011 జనాభా లెక్కల మేరకే దీనిని మోదించే అవకాశం కనిపిస్తోంది. ఈ క్రమంలో పార్లమెంట్ ఉభయ సభలు వాడీవేడిగా సాగే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న బిల్లు స్వరూపాన్ని విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. అందువల్ల నేటి నుంచి సాగే సమావేశాలపై ఉత్కంఠత కొరసాగుతోంది. ఉభయ సభల్లోనూ బిల్లుల ఆవశ్యకతపై ప్రధాని మోడీ మాట్లాడుతారు. ఇప్పటికే కాంగ్రెస్ తన వ్యూహం ఖరారు చేసుకుంది. తృణమూల్ సహా అనేక పార్టీలు అధికార బిజెపి తీరును తప్పుపడుతున్నాయి. ఇకపోతే దేశంలో అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన కోసం ఇప్పటివరకూ నాలుగు డీలిమిటేషన్ కమిషన్లు పని చేశాయి. ఇప్పుడు ఐదోది ఏర్పాటవుతోంది. ఇందులో రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే వారి సంఖ్యను 815గా, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 35గా పేర్కొంది. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 81ని సవరించాలని నిర్ణయించింది. దీని ప్రకారం దేశంలో లోక్‌సభ స్థానాలు 54.54శాతం మేర పెరిగే అవకాశముంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 82 అసెంబ్లీ స్థానాల పునర్విభజన, ఆర్టికల్ 170 అసెంబ్లీ స్థానాల గరిష్ఠ సంఖ్య గురించి చెబుతున్నాయి. ఇప్పటివరకూ ఉన్న నిబంధనల ప్రకారం ఆర్టికల్ 82 కింద అసెంబ్లీ స్థానాలను పునర్విభజించాలంటే 2026 తర్వాత ప్రచురించే తొలి జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవాలి. ఇప్పుడు ఆ నిబంధనను సవరించి ప్రతి జనాభా లెక్కల తర్వాత అసెంబ్లీ స్థానాలను పునర్విభజించడానికి అవకాశం కల్పించారు. ఆర్టికల్ 334ఏలో ఇదివరకు 106వ రాజ్యాంగ సవరణ చట్టం-2023 (మహిళా రిజర్వేషన్ల చట్టం) ఆమోదం పొందిన తర్వాత చేపట్టే తొలి జనాభా లెక్కల ప్రాతిపదికన నిర్వహించే నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. ఇప్పుడు దాన్ని సవరించి డీలిమిటేషన్ పక్రియ పూర్తయిన వెంటనే ఇవి అమల్లోకి వస్తాయని స్పష్టత ఇచ్చారు. 84వ రాజ్యాంగ సవరణ చట్టం-2001లో ఆర్టికల్ 55, 81, 82, 170, 330, 332లను సవరించి 1971 జనాభా లెక్కల ప్రకారమే పార్లమెంటు, అసెంబ్లీల సీట్లను కేటాయించాలని పేర్కొన్నారు. 2026 తర్వాత తొలి జనాభా లెక్కలు చేపట్టేంతవరకూ వాటిని పునర్విభజించకూడదని షరతు విధించారు. 2003లో చేసిన 87వ రాజ్యాంగ సవరణ చట్టంలో ఆర్టికల్ 81, 82, 170, 330లను సవరించి అసెంబ్లీ, లోక్‌సభ సీట్లను పెంచకుండా 2001 జనాభా లెక్కల ప్రకారం ఆయా రాష్ట్రాల్లోని స్థానాలను పునర్విభజించు కోవడానికి అవకాశం కల్పించారు. దీని ప్రకారం 2008లో నియోజకవర్గాల పునర్విభజన చేయగా 2009 ఎన్నికల్లో అవి అమల్లోకి వచ్చాయి. మహిళా రిజర్వేషన్లకు అనుగుణంగా దేశ వ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల పునర్విభజన కోసం సుప్రీంకోర్టు ప్రస్తుత/ మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలో డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు కానుంది. బిల్లు పార్లమెంటు ఉభయ సభల ఆమోదం పొంది చట్టరూపం దాల్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుంచి కమిషన్ అమల్లోకి వస్తుంది. సుప్రీం కోర్టు ప్రస్తుత/మాజీ న్యాయమూర్తిని కేంద్ర ప్రభుత్వం కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నియమిస్తుంది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌గానీ, ఆయన నామినీగానీ ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఉంటారు. అలాగే రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు ఎక్స్ అఫీషియో సభ్యులుగా నియమితులవుతారు. ఇది దేశవ్యాప్తంగా ఉన్న పార్లమెంటు, అసెంబ్లీలతోపాటు, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతంలోని అసెంబ్లీ స్థానాల పునర్విభజననూ చేపడుతుంది. తాజా జనాభా లెక్కల ఆధారంగా రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల వారీగా ఎన్ని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలు ఉండాలన్నది ఈ కమిషన్ నిర్ణయిస్తుంది. అలాగే రాష్ట్రాలవారీగా లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలను విభజిస్తుంది.

# కాల్పుల విరమణ గడవు పొడిగించే ఛాన్స్ లేదు

- శాశ్వతమైన ఒప్పందం వైపే మొగ్గు చూపుతున్నాం
- ట్రంప్ మరోమారు కీలక వ్యాఖ్యలు

**వాషింగ్టన్,ఏప్రిల్15:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో కొనసాగుతున్న కాల్పుల విరమణను పొడిగించే ఆలోచన తనకు లేదని.. శాశ్వతమైన ఒప్పందం వైపే తాము మొగ్గు చూపుతున్నామని అన్నారు. టెహ్రాన్‌తో చర్చలు కొనసాగుతున్నప్పటికీ.. కాల్పుల విరమణను పునరుద్ధరించకుండానే అవి ముగిసే అవకాశముందని తెలిపారు. చర్చలు ఏవిధంగా ముగిసినప్పటికీ ఇరాన్‌తో ఒప్పందం కుదిరితేనే అందరికీ మంచిదన్నారు. వాషింగ్టన్-టెహ్రాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారం గడువు ఈనెల 21తో ముగియనుంది. ఈ నేపథ్యంలో చర్చల ద్వారా శాశ్వత శాంతిఒప్పందం కుదుర్చుకోవాలని అమెరికా ఎదురుచూస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా రాబోయే రెండు రోజుల్లో మరోసారి ఇరాన్ అధికారులతో సమావేశమవనున్నట్లు తెలిపారు. రెండోవిడత చర్చలపై ఆశాభావం వ్యక్తం చేస్తూ..ఆ రెండు రోజులు అద్భుతంగా ఉండబోతున్నాయన్నారు. గతంలో ఇరాన్‌లో ఉన్న అతివాద శక్తులు పోయి.. ప్రస్తుతం కొత్త పాలన నెలకొందన్నారు. కొత్త పాలకుతో కలిసి పని చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.



# బంగ్లా పౌరుల పడవ మునక

- 250 మంది గల్లంతు.. ముమ్మర గాలింపు

ఢాకా, ఏప్రిల్ 15: అండమాన్ తీర సముద్రంలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. రోహింగ్యా శరణార్థులు, బంగ్లాదేశ్ పౌరులతో వెళ్తోన్న ఓ పడవ మునిగిపోయింది. ఘటనలో దాదాపు 250 మంది గల్లంతయ్యారు. వారి కోసం సముద్రంలో ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. గల్లంతైన వారిలో చిన్నారులు కూడా ఉన్నారు. ఈ ప్రమాదంపై ఐక్యరాజ్యసమితి శరణార్థుల హైకమిషనర్, ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ సంయుక్త ప్రకటన విడుదల చేసింది. ఈ పడవ దక్షిణ బంగ్లాదేశ్ లో టేక్‌నాఫ్ ప్రాంతం నుంచి బయల్దేరినట్లు ఈ ప్రకటనలో ఐరాస అధికారులు పేర్కొన్నారు.



మలేసియా వెళ్తుండగా బలమైన ఈదురుగాలులు, కెరటాల ఉద్ధృతి కారణంగా మునిగినట్లు వెల్లడించారు. కాగా.. ఈ పడవలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించారని, అది కూడా ప్రమాదానికి కారణమై ఉండొచ్చని తెలిపారు. ఈ పడవ ఏప్రిల్ 4న బంగ్లాదేశ్ నుంచి బయల్దేరినట్లు తెలుస్తోంది. కాక్స్ బజార్‌లోని శరణార్థుల శిబిరాల్లో ఉన్న వీరు కనీస జీవన సదు-పాయాల కోసం మలేసియాకు వలస వెళ్తుండగా ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకున్నట్లు ఐరాస అధికారులు వెల్లడించారు. వాస్తవానికి రోహింగ్యాలు.. మయన్మార్‌కు చెందినవారు. కానీ, 2017లో అక్కడి సైన్యం మారణహోమం నుంచి తప్పించుకునేందుకు లక్షలాది రోహింగ్యాలు బంగ్లాదేశ్‌కు తరలిపోయారు. దీంతో కాక్స్ బజార్‌లో శరణార్థి శిబిరాలు కిక్కిరిసిపోయాయి. అయితే, ఇటీవల ఇక్కడి పరిస్థితులూ క్షీణించడంతో వీరంతా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయేందుకు వలసబాట పడుతున్నారు. ఈ క్రమంలోనే ప్రమాదకర సముద్ర ప్రయాణాలను ఎంచుకుంటున్నారు.

# పదే పదే వైరల్ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నారా?
# ఈ జాగ్రత్తలు తీసుకోండి.!

ఈ రోజుల్లో వైరల్ ఇన్ఫెక్షన్లు ఒక సాధారణ సమస్యగా మారాయి. బలహీనత, జలుబు, జ్వరాలు లేదా తరచుగా వచ్చే అనారోగ్యాలు వాతావరణం వల్ల మాత్రమే సంభవించవు. మన అలవాట్లు, రోగనిరోధక శక్తి, పరిశుభ్రత లేకపోవడం కూడా ఎక్కువగా కారణమవుతాయి. వైద్యుల ప్రకారం, కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం వల్ల వైరల్ ఇన్ఫెక్షన్ల ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. ఇన్ఫెక్షన్‌లను నియంత్రించడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం..

**ఈ జాగ్రత్తలు తీసుకోండి**

మీ చేతులను తరచుగా కడుక్కోవడం వల్ల ఇన్ఫెక్షన్ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. సబ్బు, నీరు అందుబాటులో లేకపోతే హ్యాండ్ శానిటైజర్‌ను ఉపయోగించండి.

టూత్ బ్రష్‌లు, తువ్వాళ్లు, రేజర్లు, చేతి రుమాలు లేదా నెయిల్ కట్టర్ వంటివి బ్యాక్టీరియా, వైరస్‌లకు ప్రధాన వనరులు. వాటిని ఎప్పుడూ పంచుకోకండి. మీ పిల్లలకు కూడా అదే నేర్పండి.

దగ్గినప్పుడు లేదా తుమ్మినప్పుడు మీ నోటిని టిష్యూ పేపర్ లేదా మోచేయితో కప్పుకోండి. ఇది ఇన్ఫెక్షన్ వ్యాప్తి చెందే ప్రమాదాన్ని బాగా తగ్గిస్తుంది.

మీకు జలుబు, దగ్గు లేదా జ్వరం ఉంటే మాస్క్ ధరించడం వల్ల మిమ్మల్ని మాత్రమే కాకుండా ఇతరులను కూడా రక్షించవచ్చు. రద్దీగా ఉండే ప్రదేశాలలో కూడా మాస్క్‌లు ఉపయోగకరంగా ఉంటాయి.

ప్రయాణ సమయంలో ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. శుభ్రమైన నీరు తాగండి. పచ్చి లేదా సరిగ్గా ఉడికించని మాంసం, చేపలను తినకండి. అవసరమైన టీకాలు వేయించుకోండి. సరైన ఆహారం తీసుకోకపోవడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుంది. అధిక చక్కెర, ఉప్పు, వేయించిన ఆహార పదార్థాలను నివారించండి. తగినంత



పండ్లు, కూరగాయలు, ప్రోటీన్, నీరు తాగడం చాలా అవసరం. నిద్ర లేకపోవడం వల్ల రోగనిరోధక శక్తి బలహీనపడి ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. రోజుకు కనీసం 7 గంటలు నిద్ర అవసరం.



## సీతాఫలం నుంచి గింజలను సింపుల్‌గా ఇలా వేరు చేయవచ్చు..

ఆరోగ్యానికి ఎన్ని పండ్లు ఉన్నా.. అత్యధిక పోషకాలు ఉన్నవి మాత్రం కొన్నే ఉన్నాయి. వాటిలో సీతాఫలం ఒకటి. వీటిలో అత్యధిక పోషకాలు ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల శరీరానికి కార్బోహైడ్రేట్లు, ఫైబర్, విటమిన్లు, పొటాషియం, మెగ్నీషియం తదితర ఖనిజాలు అందుతాయి. అంతేకాదు శరీరానికి వ్యాధి నిరోధక శక్తిని సైతం అందుతుంది. తద్వారా వ్యాధులను నివారిస్తుంది. అయితే అంతా బాగానే ఉంటుంది. కానీ ఈ సీతాఫలం తింటున్నప్పుడు మధ్యలో గింజలు అడ్డు వస్తాయి. దీంతో ఒకింత చిరాకు అనిపిస్తోంది. అయినా అలాగే సీతాఫలాలను కాయ మీద కాయను లాగించేస్తూ ఉంటారు.

కానీ సీతాఫలానికి సంబంధించి.. మాస్టర్ చెఫ్ నెహా దీపక్ షా తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియోను పోస్ట్ చేసింది. ఇది సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సీతాఫలాన్ని రెండు భాగాలుగా కోసింది. ఒక చెంచాతో సీతాఫలంలోని ఒక భాగాన్ని ఫుడ్ చాపర్‌లో వేసింది. అలాగే మరో భాగాన్ని సైతం అందులో వేసింది. అనంతరం ఫుడ్ ఛాపర్ మూత పెట్టి.. కొన్ని సెకన్ల పాట్లు దీనిపై ఉంచిన తాడును పలుమార్లు లాగింది. అనంతరం ఫుడ్ ఛాపర్ మూత తీయగానే.. అందులో విత్తనాలు, గుజ్జు వేర్వేరు అయిపోయాయి. స్పూన్‌తో గింజలను వేరు చేసి.. పేస్ట్‌లాగా మారిన సీతాఫలం గుజ్జును స్పూన్‌తో తినడమే తరువాయి. ఈ వీడియోను వీక్షించిన నెటిజన్లు తమదైన శైలిలో స్పందిస్తున్నారు. ఈ సింపుల్ చిట్కాను పంచుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఇది చాలా బాగుదంటూ వ్యాఖ్యానించారు. మరొకరు.. సీతాఫల్ నుంచి విత్తనాలను తొలగించడానికి ఇది అద్భుతమైన ట్రిక్ అని అభివర్ణించారు. దీనిని తమతో పంచుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఇంకో నెటిజన్ స్పందిస్తూ.. మేడం మీకు ఒక సింపుల్ చిట్కా చెబుతానంటూ.. ఒక వైర్ మెష్ కాడ ఉన్న జాలీని తీసుకుని.. అందులో సీతాఫలం గుజ్జును వేసి.. ఒక చెంచాతో.. గట్టిగా నొక్కితే గుజ్జు కింద ఉన్న పాత్రలో పడిపోతుంది. జాలీలో గింజలు ఉండిపోతాయని వివరించారు. దయచేసి దీన్ని కూడా ప్రయత్నించడంటూ నేహకు సూచించాడు.

## చిన్న పిల్లల్లో డయాబెటిస్.. ప్రారంభ లక్షణాలు ఇవే!



డయాబెటిస్ అనేది అన్ని వయసుల వారిని ప్రభావితం చేసే వ్యాధి. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ఈ వ్యాధి బారిన పడుతున్నారు. ప్రతి సంవత్సరం రోగుల సంఖ్య పెరుగుతోంది. వృద్ధులు మాత్రమే కాదు, చిన్నపిల్లలు కూడా వివిధ కారణాల వల్ల డయాబెటిస్‌ను ఎదుర్కొంటున్నారు. డయాబెటిస్ తీవ్రమైన అనారోగ్యానికి దారితీస్తుంది. అందువల్ల, డయాబెటిస్ ప్రారంభ లక్షణాలను తెలుసుకోవడం ముఖ్యం. కాబట్టి, పిల్లలలో ఏ లక్షణాలను గమనించాలో ఇప్పుడు తెలుసుకుందాం..

**అధిక దాహం:**

మధుమేహం ఉన్నవారికి తరచుగా అధిక దాహం వేస్తుంది. దీని వలన నీటి వినియోగం పెరుగుతుంది. మీ బిడ్డ ఎక్కువ నీరు తాగుతుంటే మీరు జాగ్రత్తగా ఉండాలని నిపుణులు అంటున్నారు.

**అధిక మూత్ర విసర్జన:**

పిల్లల్లో మధుమేహం మరొక ముందస్తు హెచ్చరిక సంకేతం అధిక మూత్ర విసర్జన. ఈ లక్షణం కనిపిస్తే, వెంటనే అప్రమత్తంగా ఉండాలని నిపుణులు అంటున్నారు. ఈ స్థితిలో, గ్లూకోజ్ మూత్రం ద్వారా విసర్జించబడుతుంది. ఇది క్రమంగా పిల్లలలో తీవ్రమైన నిర్జలీకరణానికి దారితీస్తుంది. ఇది చివరికి మూత్రపిండాల పనితీరును ప్రభావితం చేస్తుందని నిపుణులు అంటున్నారు.

**అధిక ఆకలి:**

ఇది పిల్లలలో కనిపించే మరొక లక్షణం. వారి శరీరంలో గ్లూకోజ్ లేకపోవడం వల్ల ఆకలిగా అనిపించవచ్చు. వైద్యుల ప్రకారం, అధిక ఆకలి మంచిది కాదు. అందువల్ల, ఈ లక్షణం కనిపించినట్లయితే వెంటనే జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సలహా ఇస్తున్నారు.

**అస్పష్టమైన దృష్టి:**

పిల్లలలో అస్పష్టమైన దృష్టి మధుమేహం లక్షణం. రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగినప్పుడు ఇది సంభవిస్తుంది. దీని వలన కంటి లెన్స్ ఉబ్బిపోయి సరిగ్గా దృష్టి కేంద్రీకరించడం కష్టమవుతుంది.

**బరువు తగ్గడం:**

పిల్లల్లో డయాబెటిస్‌కు ఇది కూడా ఒక ప్రధాన లక్షణం. ఆరోగ్యంగా ఉన్న పిల్లలు బరువు తగ్గడం చాలా ఆందోళన కలిగిస్తుందని నిపుణులు అంటున్నారు. పిల్లలకు ఈ లక్షణాలు కనిపిస్తే, వెంటనే అప్రమత్తంగా ఉండటం ఉత్తమం. ఇంకా, సమీపంలోని వైద్యుడిని సంప్రదించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

## కేలరీలను ఎలా బర్న్ చేయాలో తెలుసా?

ఈ రోజుల్లో చాలా మంది ఎదుర్కొంటున్న సమస్య ఊబకాయం లేదా అధిక బరువు. చాలా మంది బరువు తగ్గడానికి డైటింగ్, వాకింగ్, యోగా, వ్యాయామం వంటి వివిధ పద్ధతులను ఫాలో అవుతారు. ఈ పద్ధతులన్నీ కేలరీలను బర్న్ చేస్తాయి. అయితే, శరీరం ఎక్కువ కేలరీలను బర్న్ చేస్తే, బరువు తగ్గడం వేగంగా జరుగుతుందని చాలా మంది నమ్ముతారు. అయితే, బరువు తగ్గడానికి ఇది ఆరోగ్యకరమైన మార్గం కాదు. ఒక రోజులో ఎక్కువ కేలరీలను బర్న్ చేయడం వల్ల ప్రతికూల ఆరోగ్య ప్రభావాలు ఉంటాయి. మీరు ఆరోగ్యకరమైన రీతిలో బరువు తగ్గాలనుకుంటే, మీరు పరిమిత సంఖ్యలో కేలరీలను బర్న్ చేయాలి. ఎక్కువ కేలరీలను బర్న్ చేయడం శరీరానికి హానికరం. అందువల్ల, మీరు ఒక రోజులో ఎన్ని కేలరీలను బర్న్ చేయాలో తెలుసుకోవడం చాలా ముఖ్యం.



**కేలరీలను ఎలా బర్న్ చేయాలి?**

నిపుణుల ప్రకారం, మీరు రోజుకు 300 నుండి 500 కేలరీలు బర్న్ చేయాలి.

దాదాపు 40 నిమిషాలు క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి

గ్రీన్ టీ, బ్లాక్ కాఫీ తాగడం అలవాటు చేసుకోండి.

ఒకేసారి ఏదైనా సరే అధికంగా తినకండి.

క్రమం తప్పకుండా అల్పాహారం తినండి. తక్కువ కొవ్వు ఉన్న ఆహారం తినండి.

తగినంత నీరు తాగడం చాలా ముఖ్యం. నిపుణులు రోజుకు కనీసం 8 గ్లాసుల నీరు తాగాలని సిఫార్సు చేస్తున్నారు.

**ఈ విధంగా కూడా కేలరీలను బర్న్ చేయవచ్చు.!**


చాలా మంది కేలరీలు బర్న్ చేయడానికి జిమ్‌కు వెళతారు. కొందరు కఠినమైన వ్యాయామం కూడా చేస్తారు. అయితే, మీరు సరదా కార్యకలాపాలు చేయడం ద్వారా కూడా కేలరీలను బర్న్ చేయవచ్చు. ఇంటి పనులు చేయడం, ఊడ్చడం, తుడవడం, బట్టలు ఉతకడం ద్వారా మీరు కేలరీలను బర్న్ చేయవచ్చు. మీరు నృత్యం చేయడం ద్వారా కూడా కేలరీలను బర్న్ చేయవచ్చు. మీ భాగస్వామి, పిల్లలు లేదా కుటుంబ సభ్యులతో కాసేపు డ్యాన్స్ చేయడం ద్వారా మీరు కేలరీలను బర్న్ చేయవచ్చు. డ్యాన్స్ కేలరీలను బర్న్ చేయడమే కాకుండా మానసిక ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది.

షాపింగ్ కూడా కేలరీలను బర్న్ చేస్తుంది. షాపింగ్ చేసేటప్పుడు ప్రజలు చాలా నడుస్తారు. ఇది కేలరీలను బర్న్ చేస్తుంది. బరువు తగ్గడానికి కేలరీలు బర్న్ చేయడం చాలా అవసరం. మీరు అధిక కొవ్వు ఉన్న ఆహారాన్ని తింటే, మీరు ఎక్కువ కేలరీలు బర్న్ చేయాల్సి ఉంటుంది. కానీ రోజుకు 500 కేలరీలు మించకూడదని గుర్తుంచుకోండి. ఇది మిమ్మల్ని శారీరకంగా బలహీనపరుస్తుంది.

## ఉదయం గోరువెచ్చని నీటిలో నెయ్యి కలిపి తాగితే ఎన్ని లాభాలో తెలుసా?

నెయ్యి ఆరోగ్యానికి చాలా మంచిదని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు. అయితే, చాలా మంది నెయ్యి తినడం వల్ల బరువు పెరుగుతారనే భయంతో తినరు. అయితే, మితంగా నెయ్యి తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు.

నిపుణుల ప్రకారం, నెయ్యి మెదడును ఉత్తేజపరుస్తుంది. కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. నెయ్యి ఆహార రుచిని పెంచడమే కాకుండా గణనీయమైన ఆరోగ్య ప్రయోజనాలను కూడా కలిగి ఉంటుంది. నెయ్యిలో విటమిన్లు %ూ, ఐ, జు, ఖ%, అలాగే శరీరానికి మేలు చేసే భాస్వరం, మెగ్నీషియం, కాల్షియం, ఇనుము వంటి పోషకాలు ఉంటాయి.



క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ బలపడుతుంది. కానీ ఉదయం ఖాళీ కడుపుతో గోరువెచ్చని నీటిలో నెయ్యి కలిపి తాగడం వల్ల కూడా అద్భుతమైన ప్రయోజనాలు ఉంటాయని మీకు తెలుసా? ఇది ఆరోగ్యం, శ్రేయస్సుకు దివ్యౌషధం. ఉదయం ఖాళీ కడుపుతో గోరువెచ్చని నీటిలో నెయ్యి కలిపి తాగడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకుందాం..

**జీర్ణవ్యవస్థను బలపరుస్తుంది:**

మీకు తరచుగా కడుపు సమస్యలు ఉంటే, ప్రతిరోజూ ఉదయం ఒక చెంచా నెయ్యిని గోరువెచ్చని నీటిలో కలిపి తాగడం అలవాటు చేసుకోండి. ఇది పేగులను శుభ్రపరుస్తుంది, జీర్ణవ్యవస్థను బలపరుస్తుంది. జీర్ణక్రియను సులభతరం చేస్తుంది. గోరువెచ్చని నీటితో నెయ్యి కలిపి తాగడం వల్ల అసిడిటీ, మలబద్ధకం నుండి ఉపశమనం లభిస్తుంది.

**కీళ్ల నొప్పులతో**

ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో గోరువెచ్చని నీటిలో నెయ్యి కలిపి తాగడం వల్ల కీళ్ల నొప్పుల నుండి ఉపశమనం లభిస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఇది కీళ్లను బలపరుస్తుంది.

చురకలు
గురువారం 16 ఏప్రిల్ 2026

# చరమాంకంలో తెలుగు నాటక రంగం



## తాగుబోతు నటనకు భాష్యం చెప్పిన ఎంఎస్

**నేడు ఎంఎస్ నారాయణ జయంతి**

ఎం ఎస్ నారాయణ (ఏప్రిల్ 16, 1951 – జనవరి 23, 2015) గా పిలువ బడే మైలవరపు సూర్యనారాయణ తెలుగు సినిమా హాస్యనటుడు, దర్శకుడు. దాదాపు 700 చిత్రాలలో నటించారు. కొడుకు, భజంత్రీలు చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఆయన తాగుబోతు పాత్రలను పోషించడంలో పేరొందారు. గతంలో ఆయన భీమవరంలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేశారు. శ్రీకాంత్, కృష్ణంరాజు నటించిన "మా నాన్నకు పెళ్ళి" చిత్రం ద్వారా తెలుగు చలనచిత్ర రంగానికి పరిచయమయ్యారు. అంతకు ముందు సినీ కథా రచయితగా పనిచేశారు. కథా రచయితగా పేరుపడ్డ తొలిచిత్రం వేగుచుక్క పగటిచుక్క

స్వగ్రామం పశ్చిమ గోదావరి జిల్లా లోని నిడమర్రు. వీరిది మధ్యతరగతి రైతు కుటుంబము. వీరి తండ్రి మైలవరపు బాపిరాజు రైతు, తల్లి వెంకట సుబ్బమ్మ. పదవ తరగతి పూర్తి అయిన తరువాత నాలుగు మైళ్ళ దూరంలో ఉన్న పత్తేపురంలోని ప్రాచ్య కళాశాలలో ఐదు సంవత్సరాల భాషా ప్రవీణ కోర్సు చేశారు. పత్తేపురంలోని మూర్తిరాజు కళాశాలలో సినీ రచయిత పరుచూరి గోపాలకృష్ణ లెక్చరర్‌గా పని చేసేవారు. ఆయన వద్ద ఎంఎస్ శిష్యరికం చేశారు. అది ఆయన జీవితంలో రచయితగా స్థిర పడడానికి పునాది వేసిందంటారు. తన క్లాస్‌మెట్ అయిన కళాప్రపూర్ణను ప్రేమించగా పరుచూరి వారే దగ్గరుండి పెళ్ళి చేయించడం విశేషం. వీరిది కులాంతర ప్రేమ వివాహము. పశ్చిమ గోదావరి జిల్లా కె.జి.ఆర్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేశారు. కళారంగంపై ఉన్న ఆస్తకితో అధ్యాపకుడి పదవికి రాజీనామా చేసి నటనా రంగంలోకి అడుగులు వేశారు. మొదటగా రచయితగా చిత్ర పరిశ్రమలోకి ప్రవేశించారు. ఎనిమిది చిత్రాలకు రచయితగా పనిచేశారు. ఎమ్మెస్ నటించిన తొలి సినిమా యమ్.ధర్మరాజు ఎం.ఎ. అయన కుమారుడు విక్రం కొడుకు చిత్రం ద్వారా తన చిత్ర ప్రస్థానాన్ని ప్రారంభించారు. తల్లి సుబ్బమ్మ ప్రోత్సాహంతో ఉన్నత విద్యాభ్యాసం చేసిన ఎంఎస్ ఖాళీ రోజుల్లో మాత్రం నాటకాలు వేస్తు గడిపే వారు. తన స్నేహితులతో కలిసి "బాలనాగమ్మ, భట్టి విక్రమార్క" వంటి పౌరణిక నాటకాలు వేశారు. సాంఘిక నాటకాలకు తానే పాత్రలను ఎంపిక చేసుకుని దర్శకుడిగా నాటకాలు వేసి అందర్ని మెప్పించే వారు. భీమవరం కేజీఆర్ఎల్ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తున్న సమయంలో దివిసీమ ఉప్పెన సంభవించగా తోటి కళాకారులతో కలిసి వివిధ ప్రాంతాల్లో నాటకాలు వేసి విరాళాలు సేకరించి దివి సీమ ప్రజలకు అందించారు.

1996లో "పెదరాయుడు" చిత్రంలో తొలిసారిగా వెండి తెరపై కనిపించారు. అయితే అంతుకు ముందే వెగుచుక్క-పగటి చుక్క, ప్రయత్నం, ముగ్గురు మొనగాళ్లు, పేకాట పాపారావు చిత్రాలకు అద్భుతమైన కథలు అందించి సినీ రంగంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. దర్శకుడు రవిరాజా పినిశెట్టితో రుక్మిణి సినిమా కథ చర్చల్లో ఆయన హావ భావ ప్రదర్శనకు ముగ్ధుడై హాస్య నటుడిగా ఎమ్ ధర్మరాజు ఎం. ఏ. అవకాశం కల్పించారు. పుణ్యభూమి నాదేశం, రుక్మిణి (సినిమా) చిత్రాల్లో చిన్న పాత్రలు వేసినప్పటికి 1997లో ఈవీవీ దర్శకత్వంలో మా నాన్నకు పెళ్ళి సినిమాలో తాగుబోతు తండ్రి పాత్ర ఆయనకు ఎంతో పేరు తెచ్చి పెట్టింది. దర్శకులు తనకు ఇచ్చిన పాత్రకు తానే సంభాషణ రాసుకుని సినిమాల్లో పలికే వారు.

**"ఏం చేస్తున్నావ్ ... ఏం చేస్తున్నావ్ ... అని మాటిమాటికీ అడగొద్దు. ఏదో ఒకటి చేసేయ గలను" (నువ్వు నాకు నచ్చావ్); "సోడా కొట్టడం అంటే పీజీ పాసైనంత వీజీ కాదు" (బన్ని);**

**"ఇక్కడ ఏం జరుగుతుందో నాకు తెలియాలి"** (అతడు) లాంటి డైలాగులు తెలుగు వారి హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోయాయి. ఎమ్మెస్ తన నట జీవితంలో 5 నంది అవార్డులు (రామసక్కనోడు, మానాన్నకు పెళ్ళి, సర్దుకుపోదాం రండీ, శివమణి, దూకుడు), 2 సినీ గోయెర్స్ అవార్డులు పొందారు. దూకుడు చిత్రానికిగాను ఉత్తమ సహాయనటుడిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డును అందుకున్నారు. 200 చిత్రాల్లో తాగుబోతు పాత్రల్లో ఒదిగి పోయారు. గ్లాస్ చేతిలో పట్టుకున్న ప్రతిపాత్రను ప్రేక్షకులు ఎంతో ఎంజాయ్ చేశారు. అదే విధంగా పేరడీ పాత్రలకు ఎమ్మెస్ పెట్టిం ది పేరు. దూకుడు, డిస్కో, దూబాయ్ శీను తదితర చిత్రాల్లో పేరడీ, నటనా వైవిధ్యం ప్రదర్శించడం ద్వారా ప్రేక్షకుల మదిలో నిలిచిపోయారు.

**ఉత్తమ హాస్యనటుడు – శివమణి, 2003, ఉత్తమ హాస్యనటుడు – దూకుడు, 2001 నంది పురస్కారాలు ఆయనకు లభించాయి. అనారోగ్య కారణాలతో ఆయన చికిత్స పొందుతూ 2015, జనవరి 23 న మృతిచెందారు.**

రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494


## నిర్లక్ష్యం చేస్తే కనుమరుగు ఖాయం

**నేడు తెలుగు నాటకరంగ దినోత్సవం**

(రామ కిష్టయ్య సంగన భట్ల, 9440595494)

19వ శతాబ్దంలో అనువాద నాటకాలకు అధిక ప్రాధాన్యమున్న సమయంలో ప్రదర్శనలను దృష్టితో ఉంచుకొని కందుకూరి వ్యవహార ధర్మబోధిని అనే నాటకం రాసి, షేక్స్పియర్ రాసిన కామెడీ ఆఫ్ ఎర్రర్స్ అనే అంగ్ల నాటకాన్ని చమత్కార రత్నావళి పేరుతో 1880లో అనువదించి తన విద్యార్థుల చేత ప్రదర్శిపం చేశారు. తెలుగు నాటకరంగంలో తొలి నాటక సమాజాన్ని కూడా వీరేశలింగమే స్థాపించారు. ఆధునిక తెలుగు నాటకరంగంలో తొలి నాటకకర్త, తొలి దర్శకుడు, తొలి ప్రదర్శనకారుడైన కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినాన్ని 2007లో తెలుగు నాటకరంగ దినోత్సవంగా నిర్ణయించడం జరిగింది.






నాటకం అనేది ఒక శ్రవణ సహిత దృశ్యరూపకం. జానపద కళలు విలసిల్లుతున్న రోజులలో, రాజుల పరిపాలనా కాలంలో ప్రజల వినోదం కోసం అత్యధికంగా ఆదరింపబడిన కళ నాటకం. రంగస్థలం వినోద ప్రదేశమే కాదు; వివిధ సంస్కృతుల్నీ. జాతుల్నీ, మనుషుల్నీ ఒకటిగా కలిపే ప్రక్రియ.

నాటకం సంగీతం, పాటలు, నృత్యాలతో కూడుకొన్న ప్రక్రియ. పదహారవ శతాబ్దంలో ప్రారంభమైన నాటక ప్రక్రియను చిందు భాగవతము యక్షగాన నాటకం, వీధి భాగవతం, బయలాట అనీ పిలుస్తారు. వీధి నాటకాలను ఎక్కువ ప్రచారంలోకి తెచ్చినవారు కూచిపూడి భాగవతులు. తెలుగు నాటకరంగ చరిత్ర, తెలుగులో ఆదికవిగా పేరుగాంచిన నన్నయ్య తన భారత అవతారికలో రసాన్విత కావ్యనాటకముల్ పెక్కుజూచితి అనడాన్ని బట్టి, నన్నయ కాలానికి నాటక ప్రదర్శనలుండేవని అర్థం చేసు కోవచ్చు.

తెలుగు దేశంలో ఆధునిక నాటక రచన ప్రదర్శనలకు దారితీసిన వారు పాఠశాలల్లో, కళాశాలల్లో పనిచేసిన ఉపాధ్యాయులు, ప్రధానంగా పండితులైన కోరాడ రామచంద్రశాస్త్రి, కొక్కొండ వెంకటరత్నం పంతులు, పరవస్తు వెంకట రంగాచార్యులు, వావిలాల వాసుదేవశాస్త్రి తదితరులు ఆధునిక తెలుగు నాటక రచనా ప్రారంభ విషయాన ప్రథములు. కందుకూరి వీరేశలింగం, కొండుభొట్ల సుబ్రహ్మణ్యశాస్త్రి, నాదెళ్ళ పురుషోత్తమ కవి, వడ్డాది సుబ్బారాయుడు ఆధునిక తెలుగు నాటక ప్రదర్శనారంభ విషయంలో ప్రథములు.

ఆధునిక నాటక రచన 1860 ప్రాంతాల్లో ఆరంభంకాగా నాటక ప్రదర్శన మాత్రం 1880 లో ప్రారంభమయ్యింది. ఆధునిక కాలంలో వెలువడిన తొలి తెలుగు నాటకం1860 ప్రాంతాల్లో కోరాడ రామచంద్ర శాస్త్రిచే సంస్కృతంలో నుంచి నాటక లక్షణాలను అనుసరించి తెలుగులో వెలువడిన స్వతంత్ర రచన"మంజరీ మధుకరీయము". 'ఆంధ్రా జాన్సన్ 'గా సుప్రసిద్ధులైన కొక్కొండ వెంకటరత్నం పంతులు 1871లో వారణాశి ధర్మసూరి సంస్కృతంలో రచించిన "నరకాసుర విజయము" అనే వ్యాయోగమును ఆంధ్రీకరించాడు. పరవస్తు వెంకట రంగాచార్యులు 1872 ప్రాంతాల్లో కాళిదాసు రచించిన "అభిజ్ఞాన శాకుంతలము"ను ఆంధ్రీకరించడం జరిగింది. వావిలాల వాసుదేవశాస్త్రి ఆంగ్ల నాటక ఆంధ్రీకరణ ద్వారా జూలియస్ సీజర్ నాటకాన్ని "సీజరు చరిత్రము" అను పేరుతో 1874 లో ఆసాంతం తేటగీతిలో రాశాడు.

ఆధునిక నాటక రచనకు ఆద్యులు వారైతే, ఆధునిక నాటక ప్రదర్శన ఆరంభ దశకు కందుకూరి వీరేశలింగం పంతులు, కొండుభొట్ల సుబ్రహ్మణ్య శాస్త్రి, నాదెళ్ళ పురుషోత్తమకవి, వడ్డాది సుబ్బారాయుడు రూపకర్తలు. వీరేశలింగం సంభాషణ రూపాన "బ్రాహ్మ వివాహము" అను ప్రహసనమును తన "హాస్య సంజీవని" అను పత్రికలో రచించగా, అనంతరం "వ్యవహార ధర్మబోధిని" వ్యావహారిక భాషలో రచించి, ప్రదర్శన భాగ్యం కలిగించిన తొలి తెలుగు నాటకమిది. 1880 లో వీరేశలింగం నాటక సమాజాన్ని స్థాపించి "రత్నావళి", "చమత్కార రత్నావళి" అను రెండు నాటకాలను ప్రదర్శించాడు. తెలుగునాట తొలి నాటక సమాజాన్ని స్థాపించిన ఘనత వీరేశలింగందే. ఆయన స్వతంత్ర రచన అయిన "వ్యవహార ధర్మబోధిని", సంస్కృత నాటక అనువాదమైన "రత్నావళి", ఆంగ్ల నాటక అనుసరణ అయిన "చమత్కార రత్నావళి" ప్రదర్శన భాగ్యం పొందిన తొలి తెలుగు నాటకాలు. ఇది 1880 లో జరిగింది. అందుచేత 1980 వ సంవత్సరం తెలుగు నాటకరంగ శతజయంతి సంవత్సరం అయింది.

తెలుగు నాటకాలలో పద్య పఠనమును (ఈనాడు వలె గానం కాదు) ప్రవేశపెట్టినది వడ్డాది సుబ్బారాయుడు. వీరి నాటకాలలో ప్రసిద్ధమై, "వేణీ సంహారము". తెలుగులో గద్య, పద్యాత్మకం కాగా, పద్యాలని రంగస్థలం మీద పఠించేవారు. 1884-86 మధ్య నాదెళ్ళ పురుషోత్తమ కవి 32 హిందూస్తానీ నాటకాలు రచించాడు. వీటిని 15 ఏళ్ళపాటు అనేక పట్టణాలలో విజయ వంతంగా ప్రదర్శించారు. పాత్రోచిత భాష, అనుప్రాసయుక్తము ప్రాబంధికము అయిన శైలి ఆయన పాటించిన అంశాలు. పాటలు (టపాలు) పాడుట ఇతడు ప్రవేశపెట్టిన క్రొత్త అంశము. ఈ మూడు అంశాలు కాలక్రమంలో తెలుగు నాటక రంగం మీద ప్రాధాన్యం వహించాయి. ధర్మవరం రామకృష్ణమాచార్యులు వారు తన తొలి తెలుగు నాటకమైన "చిత్రనళీయం"ను బళ్ళారిలో 1887 జనవరి 29న విజయవంతంగా ప్రదర్శించారు. రామకృష్ణమాచార్యులవారు 30 నాటకాలు రచించారు. అన్నీ స్వతంత్ర రచనలే. తన నాటకాలలో పాటలు ప్రవేశ పెట్టారు. పద్యాలను రాగయుక్తంగా పాడడం కూడా ప్రవేశ పెట్టారు. అయన "సారంగధర" తెలుగులోని తొలి స్వతంత్ర విషాద రూపకం. ప్రాచ్య-పాశ్చాత్య సిద్ధాంతాలను సమన్వయించడంలో ప్రథములైనందునే "ఆంధ్ర నాటక పితామహ" అని బిరుదునిచ్చి సత్కరించారు. చిలకమర్తి లక్ష్మీనరసింహం 1989లో నాటక రచన ఆరంభం చేయగా, అయన నాటకాలలో "గయోపాఖ్యానం" సుప్రసిద్ధమైనది. 1891లో " వెంకట రాయశాస్త్రి రచించిన "ప్రతాపరుద్రీయం" బహుళ ఖ్యాతినొందింది.

1887లో ప్రకటితమైన గురజాడ అప్పారావుగారి "కన్యాశుల్కం" వ్యావహారిక భాషలో రచించబడ్డ అత్యుత్తమైన నాటకం. 1892 ఆగస్టులో విజయనగరంలోని జగన్నాథ విలాసినీ నాటక సమాజం వారు దీనిని ప్రథమంగా విజయవంతంగా ప్రదర్శించారు. వ్యావహారిక భాషలో ఓ కొత్త మలుపు తెచ్చిన నాటకమిది. "ప్రతాపరుద్రీయం", "కన్యాశుల్కం" రెండు రాత్రుల రూపకాలు కాగా 1894 ప్రాంతాల నుంచి వివిధ నాటక రచనలు చేసినవారు కోలాచలం శ్రీనివాసరావు. అధికంగా చారిత్రక నాటకాలు రచించడంచేత "చారిత్రక నాటక పితామహుడు"గా పేరొందారు. ఆయన నాటకాలలో "కర్ణాటక రాజ్యనాశము" లేదా "రామరాజు చరిత్రము"నకు తెలుగుదేశ మంతటా విశేష ప్రాచుర్యం తెచ్చినవారు కోలాచలం మేనల్లుడైన బళ్ళారి రాఘవ.

పానుగంటి లక్ష్మీ నరసింహారావు గారు రచించిన తొలి నాటకం "నర్మదాపురుకుత్సీయము" 1900లో ప్రకటితమైంది. ఆయన నాటకాలలో "రాధాకృష్ణ", "పాదుకాపట్టాభిషేకం", "కంఠాభరణము" ప్రసిద్ధమైనవి. " 1900 నాటికి తెలుగు నాటక రచన, ప్రదర్శన వ్యాసంగాలు తెలుగుదేశంలోని అన్ని ప్రాంతాలకూ వ్యాపించాయి. 1906-20 మధ్య కాలంలో బయల్దేరిన "హరిశ్చంద్ర" నాటకాలు 13. "సారంగధర 8. ఇంకా అనేక ఇతర నాటకాలు. ధర్మవరం రామకృష్ణమాచార్యుల ప్రభావం వల్ల నాటకాలలో పద్యాలకు, పాటలకు విలువ హెచ్చిన కాలమిది. ఈ కాలంలోని ముఖ్య విశేషం తెలుగుదేశంలో వ్యాపార నాటకరంగం విజృంభించడం.

1913 ప్రాంతాల్లో కృష్ణా మండలంలో నాటక పోటీలు ప్రారంభమై దేశమంతటా వ్యాపించాయి. "గయోపాఖ్యానం", "పాండవ ఉద్యోగ విజయములు", "బొబ్బిలి యుద్ధం", "రంగూన్ రౌడి" మొదలగు నాటకాలకు విడివిడిగా పోటీలు జరిగాయి. 1929లో ఆంధ్ర నాటక కళా పరిషత్తు తెనాలిలో స్థాపించబడింది. 1930 నుంచి సాంఘిక నాటకోద్యమం విజృభించింది. "విశ్వశాంతి", "ఎన్.జీ.ఓ.", "మా భూమి", "కీర్తిశేషులు", "నిర్మల" "కుక్క" వంటి నాటక రచనల ద్వారా రచయితలు సమాజంలో చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నం చేశారు.

1935-44 మధ్య కాలంలో రేడియో రూపకం ఆవిర్భవించి అభివృద్ధి చెందింది. కాళ్ళకూరి నారాయణరావు రచించిన "చింతామణి", "వరవిక్రయం", "మధుసేవ" సమస్యల ఆలంబనగా వెలసిన నాటకాలు. ఇలా వుండగా సంప్రదాయాల ఆధిక్యాన్ని రూపుమాపడం కోసం రచనలు చేసినవారు త్రిపురనేని రామస్వామి, ముద్దుకృష్ణ, గుడిపాటి వెంకట చలం, ఆమంచర్ల గోపాలరావు మొదలగువారు. ఈ కాలంలో దువ్వూరి రామిరెడ్డి గారి "కుంభరాణా", విశ్వనాథ సత్యనారాయణ "నర్తనశాల" ఉత్తమ విషాద రూపకాలు. 1930 తర్వాత ఆంధ్ర రాష్ట్ర ఉద్యమానికి సంబంధించిన నాటకాలు కూడా వెలిశాయి. 1944-45 తరువాతి కాలాన్ని నాటక/నాటిక పోటీల యుగం అనవచ్చు. 1937 నుంచి రేడియో నాటికలు, 1944-45 నుంచి రంగస్థల ఏకాంకికలు పుంఖాను పుంఖాలుగా వెలువడు తున్నాయి. 1964లో ఎన్.ఆర్.నంది రచించిన "మరో మొహెంజొదారో" నాటకం ద్వారా తెలుగు నాటక ప్రయోగంలో "ఫ్రీజ్" ప్రవేశించింది.

ఆ తరువాత లెక్కలేనన్ని ప్రయోగాలు ఆధునిక నాటకరంగాన్ని వరించాయి. సాంఘిక నాటకాలలో లేజర్ టెక్నిక్‌ను వాడడం ద్వారా సైంటిఫిక్ పోకడలను సైతం గ్రహించి ప్రదర్శించే అవసరం అనివార్యం అయింది.

ఇక ప్రస్తుతం రంగస్థలానికి కావల్సిన సౌకర్యాలు సరైన థియేటర్లు లేవు. ఏదో హాలులో నాటకం వేయ్యాల్సిన పరిస్థితులు. అతి ముఖ్యమైన మైకులూ, స్పీకర్ సిస్టములూ ఉండవు. ఉన్నా సరిగా పనిచేయవు. మైకులు మొరాయించని నాటకం ఉండదూ అంటే అతిశయోక్తి కాదు. నటులూ అంటే సినిమా నటులే అన్న ఒక అభిప్రాయం బలంగా నాటుకు పోయింది. సినిమాల్లో నటన ముక్కలు ముక్కలుగా చిత్రీకరించ బడుతుంది. నాటకంలో ఏకబిగిన మొత్తం సన్నివేశంలో నిమగ్నమై నటించాలి. అది చాలా కష్టం. నాటకాలు వేసిన వాళ్ళు సినిమాల్లో రాణిస్తారేమో కానీ, సినిమా నటులు నాటకాల్లో రాణించడం అంత సులభం కాదు. ఇది వరకు తెలుగు సినిమా నటుల్లో అధికులు నాటక రంగం నుండి వచ్చిన వారే అన్న విషయం గుర్తుంచు కోవాలి. ఏటా నంది నాటకాలు పేరు చెప్పి ఓ పది పదిహేను





## మంత్రి పొన్నం ప్రభాకర్ కు ఘనస్వాగతం



**ఆదిలాబాద్:** 'ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో పాల్గొనేందుకు బుధవారం ఆదిలాబాద్ జిల్లాకువచ్చిన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు నాయకులు ఘన స్వాగతం పలికారు. జిల్లా కేంద్రంలోని హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న మంత్రికి కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ పుష్పగుచ్ఛం అందజేసి సాదరంగా ఆహ్వానించారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా మంత్రి ఈ పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులపై మంత్రికి ప్రాథమికంగా వివరించారు. అనంతరం మంత్రి జిల్లా అధికారులతో కలిసి నిర్ణీత కార్యక్రమాల్లో పాల్గొనేందుకు బయల్దేరి వెళ్లారు. మంత్రిని కలిసిన వారిలో పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టివేత



**తాండూర్:** మండలంలోని కిష్టంపేట గ్రామంలోనీ ఎస్సీ కాలనీలో మోటం దేవేందర్ అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు తాండూర్ ఎస్సై కె.ప్రసాద్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మోటం దేవేందర్ ప్రభుత్వం ఇస్తున్న బియ్యాన్ని ప్రజల నుంచి కొనుగోలు చేసి ఎక్కువ ధరలకు అమ్మాలనే ఉద్దేశంతో అతని ఇంటి వెనుక ఉన్న షెడ్ లో ఉంచడం జరిగిందన్నారు. బియ్యం ఉన్నట్లు అందిన పక్కా సమాచారం మేరకు దాడి చేయగా, షెడ్ లో 18 క్వింటాళ్ల బియ్యం లభించినట్లు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

## చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన



**తాండూర్:** చిన్న పిల్లల్లో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని డీడబ్ల్యూఓ రౌఫ్ ఖాన్ తెలిపారు. తాండూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి, అన్నప్రాసన కార్యక్రమాన్ని జరిపారు. అలాగే గ్రామంలోని ఓ గర్భిణీకు ఐసీడీఎస్ అధికారులు, అంగన్వాడీ టీచర్లు కలిసి శ్రీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం గురించి తల్లులకు అవగాహన కల్పించారు. పిల్లల ఎదుగుదలకు పోషకాహారం ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ స్వరూప, సూపర్ వైజర్ రమాదేవి, వార్డు సభ్యుడు జంబోజుల ప్రవీణ్, అంగన్వాడీ టీచర్లు ప్రమీల, రాజేశ్వరి, శ్యామల, మండలంలోని ఇతర అంగన్వాడీ కేంద్రాల టీచర్లు, తల్లులు, చిన్నారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జిల్లాలో సెగలు..

- వేడిగాలులతో అప్రమత్తంగా ఉండండి..!
- చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశం




**ఆదిలాబాద్:** జిల్లాలో భానుడు భగభగలాడుతున్నాడు. రానున్న వారం రోజుల పాటు జిల్లాలో ఎండల తీవ్రత పెరగడమే కాకుండా, వేడిగాలులు వీచే అవకాశం ఉన్నందునా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచించారు. బుధవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేస్తూ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.జిల్లా వ్యాప్తంగా సాధారణం కంటే 1.5 డిగ్రీల నుంచి 3.5 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ప ట్ట ణాలు, గ్రామాలు, ప్రధాన ట్రాఫిక్ కూడళ్లలో తక్షణమే చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియలో స్వచ్ఛంద సంస్థలు, రెడ్క్రాస్ వంటి సేవా సంస్థలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. చలివేంద్రాల్లో ప్రజలకు తాగునీటితో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. వైద్య ఆరోగ్య శాఖ కూడా అప్రమత్తంగా ఉండాలని, అన్ని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో డీహైడ్రేషన్ చికిత్సకు అవసరమైన మందులు, ఫస్ట్ ఎయిడ్ కిట్లను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. భారత వాతావరణ శాఖ వెబ్సైట్ను అనుసరిస్తూ వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు గమనించాలని, జిల్లాలో 'హీట్వేవ్ యాక్షన్ ప్లాన్'ను పక్కాగా అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు తగినంత నీరు తాగుతూ శరీరాన్ని హైడ్రేటెడ్గా ఉంచుకోవాలని కోరారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, గర్భిణీలు, అనారోగ్యంతో ఉన్న వారు మధ్యాహ్నం వేళ బయటకు రాకుండా జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలకు ప్రజలు సహకరిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూ చించారు.

## ప్రజల దాహార్తి తీర్చడం అభినందనీయం



**జైనూర్:** వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడం కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎస్సై రవి అన్నారు. మండలంలోని బస్టాండ్ వద్ద జామియాతే ఉల్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జామియాతే ఉల్మా జనరల్ సెక్రటరీ, జాయింట్ మౌలానా మెహ్రాజొద్దీన్, హాఫిజ్ సయ్యద్ మునీర్ లతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో తీవ్ర ఉష్ణోగ్రతలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు చల్లని తాగునీరు దాహార్తిని తీరుస్తుందని పేర్కొన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు మరింతగా చేపట్టాలని సూచించారు. వేసవి తీవ్రత దృష్ట్యా దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ఎంతగానో దోహద పడుతుందని అన్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్పా ఇండ్ల నుంచి బయటకు వెళ్లవద్దని సూచించారు. ఎండ నుంచి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మరో వారం రోజులు వేడి తీవ్రత ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సన్ రైజర్ ఫౌండేషన్ అధ్యక్షులు షేక్ జమీల్, మాజీ ఎంపీపీ అబ్దుల్ రషీద్, యువజన నాయకుడు అజ్జు లాలా, అబ్దుల్ రహీం, వార్డు సభ్యులు షఫీక్ అన్సారీ, షేక్ ఆరీఫ్, జామియాతే ఉల్మా సభ్యులు, యువజన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత మనందరి బాధ్యత

- మంత్రి పొన్నం ప్రభాకర్
- జిల్లా కేంద్రంలో అవగాహన సదస్సు, బైక్ ర్యాలీ



**ఆదిలాబాద్:** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ కూడా మంత్రి వెంట పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ పెరిగిపోతున్న రోడ్డు ప్రమాదాల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదాలతో ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్నాయని, దీనిని నివారించాలంటే స్వీయ నియంత్రణ, క్రమశిక్షణ ఎంతో అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత అతివేగాన్ని వీడనాడి బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని, ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించి ప్రాణ రక్షణ పొందాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్, నిబంధనలను పాటించడం ప్రతి పౌరుడి ప్రాథమిక కర్తవ్యమని స్పష్టం చేశారు. సదస్సు అనంతరం నిర్వహించిన భారీ బైక్ ర్యాలీలో మంత్రితో కలిసి ఆడే గజేందర్ స్వయంగా పాల్గొని ప్రజల్లో చైతన్యం నింపారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే ప్లకార్డులతో సాగిన ఈ ర్యాలీ పట్టణ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం ఆడే గజేందర్ మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలందరూ రోడ్డు నియమాలను పాటించేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం చేపడుతున్న భద్రతా కార్యక్రమాలకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## నిబంధనలు బేఖాతరు.. అక్రమంగా వాటర్ ప్లాంట్ల దందా

- కానరాని అధికారుల తనిఖీలు.. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం
- నాణ్యత లేని నీటితో అనారోగ్యం పాలవుతున్న జనం



**ఆదిలాబాద్:** జిల్లా వ్యాప్తంగా మినరల్ వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండానే వ్యాపారమే పరమావధిగా సాగుతున్న ఈ కేంద్రాలపై అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కరువైంది. నాణ్యతా ప్రమాణాలను గాలికొదిలేసి కలుషిత నీటిని విక్రయిస్తుండటంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

**అనుమతులు శూన్యం – అక్రమాలు అపారం..**

నియమ నిబంధనల ప్రకారం వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే ఐఎస్ఐ ముద్రతో పాటు భూగర్భ జల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, స్థానిక సంస్థల నుంచి అనుమతులు తప్పనిసరి. కానీ మండలంలోని ఏ ఒక్క ప్లాంట్కు కూడా పూర్తిస్థాయిలో అనుమతులు లేవన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అసలు నీటిలో ఖనిజ లవణాలు ఎంత ఉండాలి..? బ్యాక్టీరియా లేకుండా ఎలా శుద్ధి ప్రక్రియ చేపడుతున్నారు..? అనే విషయాలను పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

**ప్రాణాంతకంగా మారుతున్న మినరల్ వాటర్..**

శుద్ధి చేసిన నీటి పేరుతో సరఫరా చేస్తున్న నీరు తాగడం ద్వారా ప్రజలు కడుపునొప్పి, మూత్రపిండాల వ్యాధులు, చర్మ సంబంధిత వ్యాధులకు గురవుతున్నారు. ప్లాంట్లలో వాడే ఫిల్టర్లను నిర్ణీత కాలంలో మార్చకపోవడం, నిల్వ చేసే ట్యాంకులను శుభ్రం చేయకపోవడంతో నీరు కలుషితం అవుతోంది. దీనికితోడు నీటి సరఫరా చేసే వాహనాలు, క్యాన్లు కూడా అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. భూగర్భ జలాల విచ్చలవిడి వాడకం వాణిజ్య అవసరాల కోసం లోతైన బోర్లు వేసి భూగర్భ జలాలను విచ్చలవిడిగా తోడేస్తున్నారు. దీని కారణంగా చుట్టుపక్కల బావుల్లో, బోర్లలో నీటి మట్టం తగ్గిపోయి సామాన్య ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడుతోంది. ప్రభుత్వం నుంచి ఎలాంటి ట్రేడ్ లైసెన్స్ లేకుండా, కమర్షియల్ విద్యుత్ వాడకుండానే భారీగా లాభాలు గడిస్తున్నా అధికారులు మిన్నకుండిపోవడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**స్పందించని యంత్రాంగం..**

గతంలో పలుమార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్లాంట్ల వద్దకు వెళ్లి శాంపిల్స్ సేకరించి ల్యాబ్కు పంపించడంలో ఆహార భద్రతా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని, జిల్లాలో అక్రమంగా కొనసాగుతున్న వాటర్ ప్లాంట్లను సీజ్ చేయాలని, ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్న నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

# నిబంధనలు పాటించడం.. ప్రాణాలకు రక్షణ కవచం

- రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్
- ద్యార్థులతో భారీ మానవహారం.. బైక్ ర్యాలీలో స్వయంగా పాల్గొన్న మంత్రి
- మద్యం సేవించి వాహనం నడపడం ఆత్మహత్యతో సమానం: ఎమ్మెల్యే పాయల్ శంకర్




**ఆదిలాబాద్:** రహదారి నిబంధనలు పాటించడం కేవలం చట్టం కోసం కాదని, అది మన ప్రాణాలకు రక్షణ కవచమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో 'ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక'లో భాగంగా నిర్వహించిన 'అరైవ్.. అలైవ్' రహదారి భద్రత అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో సహజ మరణాల కంటే రోడ్డు ప్రమాదాలతో ప్రాణాలు కోల్పోతున్న వారే ఎక్కువగా ఉండటం ఆవేదన కలిగించే అంశమని అన్నారు. ప్రమాదాల నివారణకు ప్రభుత్వం నాలుగు ప్రధాన అంశాలపై దృష్టి సారించిందని తెలిపారు. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం. శాస్త్రీయంగా రహదారుల నిర్మాణం, లోపాల సవరణ, నిబంధనల కఠిన అమలు.. ప్రమాదం జరిగిన వెంటనే తక్షణ వైద్య సదుపాయం అందించడం.. ముఖ్యంగా 25 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు గల వారు అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం ద్వారా ప్రమాదాలకు గురవుతున్నారని, హెల్మెట్, సీట్ బెల్టు ధరిస్తే ప్రాణాపాయం తప్పుతుందని స్పష్టం చేశారు.

**ప్రత్యేక ఆకర్షణగా 'మానవహారం'..**

జిల్లా కేంద్రంలోని భాగంగా స్టేడియం మైదానంలో పాఠశాల విద్యార్థులతో కలిసి మంత్రి 'హెల్మెట్ – సేవ్ లైవ్స్' ఆకారంలో భారీ మానవహారాన్ని నిర్వహించారు. అనంతరం ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి అంబేద్కర్ చౌక్ వరకు నిర్వహించిన భారీ బైక్ ర్యాలీని మంత్రి ప్రారంభించడమే కాకుండా, స్వయంగా బైక్ నడిపి యువతలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ యువత వేగాన్ని నియంత్రించుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపడం ఆత్మహత్యతో సమానమని అన్నారు. ప్రజల్లో మార్పు వచ్చినప్పుడే వ్యవస్థల కృషి ఫలిస్తుందని పేర్కొన్నారు.

**సేవా కార్యక్రమాలు.. గుర్తింపు కార్డుల పంపిణీ..**

సదస్సు అనంతరం మంత్రి పలువురు యువతకు లెర్నింగ్ లైసెన్స్‌లను, డ్రైవర్లకు ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. స్టేడియం ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. అంబేద్కర్ చౌక్ వద్ద వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేసి, ట్రాఫిక్ నిబంధనల ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, జిల్లా ఇంచార్జి కలెక్టర్ యువరాజు మర్మాట్, ఎస్పీ అఖిల్ మహాజన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వైభవంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవం



**హత్నూర:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం చింతల్ చెరువు గ్రామంలోని శ్రీ పార్వతీ సమేత సంగమేశ్వర స్వామి దేవాలయంలో శివపార్వతుల కళ్యాణ మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేవాలయం దశమ వార్షికోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ మహోత్సవం అత్యంత ఘనంగా జరిగింది. లోక కళ్యాణార్థం వీరశైవ ఆగమోక్త పద్ధతిలో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య శివపార్వతుల కళ్యాణం జరిపారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించి పరమేశ్వరుని ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మమతా శివ, ఉప సర్పంచ్ అంబటి భాస్కర్, పంచాయతీ కార్యవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

# ప్రకృతి అందాలకు నెలవు పులిగుండాల

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- ఎకో టూరిజం ప్రాజెక్టు ప్రారంభ



**సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం పెనుబల్లి మండలం బ్రాహ్మళ్లకుంట పరిధిలోని పులిగుండాల వద్ద ఏర్పాటు చేసిన ఎకో టూరిజం ప్రాజెక్టును ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జంగిల్ సఫారీ, బోటింగ్ వంటి పర్యాటక సదుపాయాలను కూడా ప్రారంభించారు. కనకగిరి గుట్టల మధ్య అద్భుతమైన ప్రకృతి సోయగాలతో కళకళలాడుతున్న పులిగుండాల ప్రాంతాన్ని సందర్శించిన వారు అక్కడి అందాలను పరిశీలించారు. తెలంగాణలోని అపురూపమైన ప్రకృతి సంపదను ప్రపంచానికి పరిచయం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తోందని తెలిపారు. భవిష్యత్తులో పులిగుండాలను అన్నిరకాల సదుపాయాలతో అభివృద్ధి చేసి రాష్ట్రంలోని ఉత్తమ మూడు పర్యాటక కేంద్రాల్లో ఒకటిగా నిలబెట్టాలని సంకల్పించామని పేర్కొన్నారు. పర్యాటకుల రాకపోకలకు సౌకర్యంగా ఉండేలా ఈ ప్రాంతానికి వెళ్లే రహదారిని త్వరలోనే డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేయడానికి అనుమతులు మంజూరు చేసి, అవసరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేస్తుందని తెలిపారు. కనకగిరి హిల్స్ అభివృద్ధికి తక్షణమే కార్యాచరణ ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని, ఆ ప్రాజెక్టు నుంచి పులిగుండాలకు నీటిని మళ్లించే అవకాశాలను కూడా పరిశీలిస్తామని అన్నారు. దీంతో వేసవి కాలంలో కూడా ఈ ప్రాంతం జలకళతో కళకళలాడుతుందని పేర్కొన్నారు. పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మట్టా రాగమయి దయానంద్, రాందాస్ నాయక్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, పీసీసీఎఫ్, జిల్లా కలెక్టర్, సీపీ, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ జనరల్ బాడీ సమావేశం బైకాట్

## సర్పంచ్ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన వార్డు సభ్యులు



**హత్నూర:** మండలంలోని కాసాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించాల్సిన జనరల్ బాడీ సమావేశాన్ని మెజారిటీ వార్డు సభ్యులు బైకాట్ చేశారు. సమావేశాన్ని బహిష్కరించిన వారు పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో పాలకవర్గం ఏర్పడి నాలుగు నెలలు కావస్తున్నప్పటికీ ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టడం లేదని ఆరోపించారు. పంచాయతీకి నిధులు ఉన్నప్పటికీ గ్రామంలో తలెత్తిన చిన్న చిన్న సమస్యలను కూడా పరిష్కరించడంలో సర్పంచ్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గత నాలుగు నెలలుగా గ్రామ సభలు, జనరల్ బాడీ సమావేశాల్లో సమస్యలను గుర్తించడం, తీర్మానాలు చేయడం తప్పా అభివృద్ధి పనులు అమలు చేయడంలో ఎలాంటి పురోగతి లేదని సభ్యులు పేర్కొన్నారు. తాగునీటి సౌకర్యం, మురికి కాలువల నిర్మాణం, విద్యుత్ స్తంభాల బలోపేతం, దోమల నివారణకు పారిశుధ్య చర్యలు వంటి కనీస సౌకర్యాలు కల్పించడంలో కూడా సర్పంచ్ ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అదేవిధంగా ఆయా వార్డుల్లో ఉన్న సమస్యలను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, వార్డు సభ్యులే తమ సొంత ఖర్చులతో సమస్యలను పరిష్కరించుకోవాలని చెప్పడం బాధాకరమని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో వార్డు సభ్యులు అనిత, సులోచన, ప్రమీల, షైనాజ్, ప్రతాప్, సాగర్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# వెంకటాపురంలో తీరిన కరెంట్ కష్టాలు

- 33/11 కే.వి విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన




**సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గం వేంసూరు మండలంలోని వెంకటాపురం గ్రామంలో నిర్మించనున్న 33/11 కే.వి విద్యుత్ ఉపకేంద్రానికి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఉపకేంద్రం నిర్మాణం పూర్తయితే పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడటంతో పాటు వోల్టేజ్ సమస్యలు తగ్గుతాయని తెలిపారు. దీంతో రైతులకు సాగు నీటికి అవసరమైన విద్యుత్ అందుబాటులోకి వచ్చి వ్యవసాయ రంగానికి మేలు జరుగుతుందని, గృహ వినియోగదారులకు కూడా సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రిహానా బేగం కమల్ పాషా, వైస్ చైర్మన్ బొంతు సుమలత, సత్తుపల్లి నియోజకవర్గంలోని ఐదు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, మహిళా, యూత్, ఎన్ఎస్యూఐ నాయకులు, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పుచ్చకాయ సోమిరెడ్డి, వెంకటాపురం గ్రామ కాంగ్రెస్ నాయకులు జంగా శ్రీనివాస్ రెడ్డి, గొర్ల శ్రీనివాస రెడ్డి, పుచ్చకాయల చెన్నారెడ్డి, చిలుకూరి సత్యనారాయణ రెడ్డి, గొర్ల నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు

# జిల్లా అదనపు కలెక్టర్ గా రాములు బాధ్యతల స్వీకరణ



**మంచిర్యాల:** మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా వి.రాములు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్కు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ జిల్లాలో రెవెన్యూ పరిపాలనను ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ పారదర్శకంగా విధులు నిర్వహిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు జిల్లా అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# స్థలం మార్చమంటే అరెస్ట్ చేస్తారా..?

- అభివృద్ధి కోరుకుంటే పోలీస్ స్టేషనా..
- భట్టి పర్యటన వేళ గ్రామ నేతల ముందస్తు అరెస్టులు




**సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం వేంసూరు మండలం వెంకటాపురం గ్రామంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పర్యటన నేపథ్యంలో పోలీసుల ముందస్తు అరెస్టులు ఉద్రిక్తతకు దారితీశాయి. గ్రామాభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, అయితే జనావాసాల మధ్య విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం ప్రమాదకరమని చెప్పినందుకే అరెస్టులు చేయడం సరైంది కాదని గ్రామ ప్రజాప్రతినిధులు పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సబ్‌స్టేషన్ శంకుస్థాపనను అడ్డుకుంటారనే అనుమానంతో పోలీసులు బుధవారం తెల్లవారుజామునే గ్రామానికి చేరుకుని సర్పంచ్ సాదు లక్ష్మి, ఉప సర్పంచ్ పాల గంగాధర్ రెడ్డి, మాజీ ఎంపీపీ పొగుట్ల వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ పాల వెంకటరెడ్డిలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సాదు లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు తాము వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. జనావాసాల మధ్య హై వోల్టేజ్ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మిస్తే ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉంటుందని, అందుకే స్థలాన్ని మార్చాలని మాత్రమే కోరుతున్నామని తెలిపారు. సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం అవసరమైతే గ్రామ ప్రజలే స్వచ్ఛందంగా మరోచోట స్థలం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రజల భద్రతను పరిగణలోకి తీసుకోకుండా మొండిగా అదే ప్రదేశంలో నిర్మాణం చేపట్టడం సరికాదన్నారు. గ్రామ ప్రథమ పౌరురాలైన తనను పర్యటన సాకుతో అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని మండిపడ్డారు.

## నీటి సమస్య పరిష్కారానికి చర్యలు



**గుడిహత్నూర్:** వేసవి కాలంలో తలెత్తే నీటి కష్టాలను నివారించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని ఆ గ్రామ సర్పంచ్ ఆడే శీల తెలిపారు. గ్రామంలో వాడుకలో లేని బోరు బావులు, చేతి పంపులను మరమ్మత్తులు చేయించి గ్రామస్తులకు తాగునీటి సరఫరా సక్రమంగా అందేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఆడే క్రాంతి మాట్లాడుతూ గ్రామంలోని నీటి సమస్యలు ఉన్న కాలనీలను గుర్తించి సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది శ్రీపతివార్ విజయ్, నారాయణ, మోసిన్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్కు బోరంచు సన్మానం




రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం 'అరైవ్.. అలైవ్'పేరుతో 99 రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బుధవారం ఆదిలాబాద్ పర్యటనకు వచ్చిన మంత్రికి కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. జిల్లా కేంద్రంలోని చావర స్కూల్లో నిర్వహించిన రోడ్ సేఫ్టీ ర్యాలీలో మంత్రి పాల్గొని వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు. అనంతరం డీసీసీ కార్యాలయంలో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి మంత్రిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## గజదొంగ టేకం తుకారపై పీడీ యాక్ట్ నమోదు



గత పదేళ్లుగా ఐదు జిల్లాల పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న గజదొంగ టేకం తుకారపై ఉట్నూర్ పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేశారు. నిందితుడిపై ఇప్పటివరకు మొత్తం 44 కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు. గతంలో జైలు శిక్ష అనుభవించినప్పటికీ అతని ప్రవర్తనలో మార్పు రాక పోవడంతో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సిఫార్సు మేరకు జిల్లా కలెక్టర్ పీడీ యాక్ట్ అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉట్నూర్ సీఐ మడవి ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుడిని పీడీ యాక్ట్ కింద బుధవారం చర్లపల్లి జైలుకు తరలించారు. నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, చట్టాన్ని అతిక్రమించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని హెచ్చరించారు.

# చెన్నూర్ నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం

- **రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద**

**మంచిర్యాల:** చెన్నూర్ నియోజకవర్గ పరిధిలోని ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లాలోని మందమర్రి మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, మందమర్రి, క్యాతనపల్లి, చెన్నూర్ మున్సిపాలిటీల కమిషనర్లు రాజలింగు, మారుతి ప్రసాద్, మురళీకృష్ణ, సింగరేణి సంస్థ మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణలతో కలిసి అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి



మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. మున్సిపల్ పరిధిలో అంతర్గత రహదారులు, మురుగు కాలువల వ్యవస్థను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి పట్టణాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. వేసవి కాలంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రతిరోజూ తాగునీటి సరఫరా జరిగేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. అనంతరం మందమర్రి మండల కేంద్రంలోని నైపుణ్య అభివృద్ధి కేంద్రాన్ని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ దేవానంద్లతో కలిసి సందర్శించారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. టాంకామ్ ద్వారా విదేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామని, ముఖ్యంగా జర్మనీలో ప్రతి సంవత్సరం లక్షలాది ఉద్యోగావకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన అధునాతన సాంకేతిక కేంద్రాల (ఏటీసీ) ద్వారా వేలాది యువతకు వివిధ కోర్సుల్లో శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. ప్రైవేట్ ఏజెన్సీల మోసాలకు గురికాకుండా టాంకామ్ ద్వారా అందిస్తున్న అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించా రు. అనంతరం మందమర్రిలోని ఏటీసీ సెంటర్ను సందర్శించి అక్కడి శిక్షణ కార్యక్రమాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడ్డవారికే పార్టీ పదవులు కట్టబెట్టాలి

**ఆదిలాబాద్:** పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకే పార్టీ పదవులు కట్టబెట్టాలని బోథ్ మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆదిలాబాద్లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్ను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకే పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టుల నియామకాల్లో స్థానిక నాయకత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక పరిస్థితులు బాగా తెలిసిన నాయకులు, కష్టపడే కార్యకర్తల సూచనలతో నిర్ణయాలు తీసుకుంటే పార్టీ మరింత బలపడుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో, ముఖ్యంగా సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు



కోసం కష్టపడ్డ కార్యకర్తలను గుర్తించి వారికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అలాగే పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు. పార్టీ కోసం ఐక్యతతో, క్రమశిక్షణతో పనిచేయాలని, వ్యక్తుల కంటే పార్టీ ముఖ్యమనే భావనతో ముందుకు సాగాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, మాజీ బ్లాక్ ప్రెసిడెంట్ మెరుగు నరసింహ దాస్, మాజీ ఎంపీటీసీ మహేందర్, మాజీ ఎంపీటీసీ, ప్యాక్స్ డైరెక్టర్ చట్ల ఉమేష్, డీసీసీ జనరల్ సెక్రటరీ ఆత్రం సుశీల, సెక్రటరీ వినయ్ రెడ్డి, కుచ్లాపూర్ సర్పంచ్ నారాయణ, పద్మశాలి సంఘం అధ్యక్షుడు మెరుగు భోజన్న, సాయన్న, ఆత్మ డైరెక్టర్ రహీం, మార్కెట్ డైరెక్టర్ అబ్రార్, సురేందర్, ఉప సర్పంచ్ రమేష్, పోతా రెడ్డి, దినేష్ రెడ్డి, షామిందర్ రెడ్డి, అలపాటి అచ్యుతానంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రోరేటా ప్రతిపాదనపై భిన్నాభిప్రాయాలు

**ఆదిలాబాద్:** కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న ప్రోరేటా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని ఆదిలాబాద్ యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీకర్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా నియంత్రణలో ఆదర్శంగా నిలిచిన దక్షిణాది రాష్ట్రాలకు నియోజకవర్గాల పెంపులో అన్యాయం జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రోరేటా ప్రాతిపదికన విభజన జరిగితే జనాభా ఎక్కువగా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలకు లాభం చేకూరుతుందని, దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గిపోతుందని అన్నారు. ఈ విధానం ద్వారా ఎస్సీ, ఎస్టీ, మహిళా రిజర్వేషన్ సీట్ల సంఖ్య కూడా తగ్గి ఆయా వర్గాలకు రాజకీయంగా అన్యాయం జరుగుతుందని తెలిపారు. మహిళా రిజర్వేషన్ల ముసుగులో దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యతను తగ్గించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని విమర్శించారు. తెలంగాణ



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించిన జీఎస్డీపీ ఆధారిత 'హైబ్రీడ్ మోడల్'ద్వారా నియోజకవర్గాలను పెంచాలనే ప్రతిపాదనకు తాను మద్దతు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి ప్రజల్లో అవగాహన కల్పిస్తూ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు

**బజార్ హత్నూర్:** బజార్ హత్నూర్ గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్, గ్రామ మున్నూరుకాపు సంఘం సలహా సభ్యుడు చాట్ల విలాస్, బాలన్పూర్ గ్రామానికి చెందిన ఆదివాసీ నాయకుడు తులసీరాం కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్లో చేరిన నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కోట్లాది ప్రజలతో కలిసి తాము కూడా పోరాటం చేశామని తెలిపారు. అయితే తాము పనిచేసిన పార్టీలో తగిన గుర్తింపు, గౌరవం లభించక పోవడంతో నిరాశకు గురయ్యామని అన్నారు. చులకనగా చూసే పరిస్థితులు ఎదురవ్వడంతో ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు తమను ఆకర్షించాయని తెలిపారు. అందుకే కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా చేరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జల్కె పాండురంగ్, మాజీ నెట్ క్యాప్ డైరెక్టర్ చిలుకూరి భూమన్న, నాయకులు విజేందర్, అరే పాండు, రవి, సందీప్, బద్దం పోతారెడ్డి, ఎండి సద్దాం తదితరులు పాల్గొన్నారు.



## అటవీ శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**తిర్యాణి:** మండలంలోని మంగి గ్రామ పంచాయతీలో అటవీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ పల్లవి నేతృత్వంలోని వైద్య బృందం గిరిజనులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేసింది. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారి స రోజ రాణి మాట్లాడుతూ గిరిజనులకు ఏ అవసరం వచ్చినా అటవీ శాఖ అండగా ఉంటుందని తెలిపారు. అదే సమయంలో అడవిని,



అటవీ సంపదను కాపాడటం ప్రతిఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఆర్ఓ షావాజ్, బీట్ అధికారులు రవి, కృష్ణ చైతన్య, మధుకర్, చంద్రకళ, రజిత, శివాని, శ్రీలత, మంగి సర్పంచ్ రైసిదాం వినోద్ కుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పల్లవి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత పై మానవహారం

- సీఐ శివశంకర్...ఆర్టీవో మేఘా గాంధీ
- ఎస్సై వెంకటేశ్వర్లు



**నారాయణపేట, ఏప్రిల్,15 :** “అరైవ్ అలైవ్” కార్యక్రమంలో భాగంగా బుధవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని సావర్కర్ (ఓల్డ్ బస్టాండ్) చౌరస్తాలో విద్యార్థులతో కలిసి నారాయణపేట పోలీసులు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు మానవహారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాన్ని నారాయణపేట సీఐ శివశంకర్, ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించగా, ముఖ్య అతిథిగా ఆర్టీవో మేఘా గాంధీ పాల్గొన్నారు. అనంతరం ఓల్డ్ బస్టాండ్ చౌరస్తాలో మానవహారం నిర్వహించి ప్రజలకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా మాత్రమే ప్రమాదాలను తగ్గించగలమని తెలిపారు. “రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా నిర్లక్ష్యం, వేగం, ట్రాఫిక్ నియమాల ఉల్లంఘన వల్ల జరుగుతున్నాయి. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తేనే ప్రమాదాలను తగ్గించవచ్చు, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం ప్రాణాలను రక్షించే ముఖ్యమైన సాధనాలు. వీటిని తప్పనిసరిగా వినియోగించాలి అని పేర్కొన్నారు. “యువత రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండి ఇతరులకు కూడా తెలియజేయాలి. నియమాలను పాటించడం ద్వారా మనం మాత్రమే కాదు, సమాజాన్ని కూడా రక్షించగలము తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు రోడ్డు భద్రత నియమాలను పాటిస్తామని, ఇతరులను కూడా చైతన్యపరుస్తామని ప్రతిజ్ఞ చేశారు. “అరైవ్ అలైవ్” కార్యక్రమం ప్రధాన లక్ష్యం రోడ్డు ప్రమాదాలను తగ్గించడం మరియు ప్రజల్లో భద్రతపై అవగాహన పెంపొందించడం అని అధికారులు తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య, ఎస్సై 2 గాయత్రి, పోలీస్ సిబ్బంది, ఆర్టీవో అధికారులు, విద్యార్థులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# సిద్దిపేటకు నేరుగా బస్సులు నడపాలి

- రాయపోల్ మండల ప్రజల డిమాండ్.



**రాయపోల్, ఏప్రిల్ 15:** గజ్వేల్--ప్రజ్ఞాపూర్ నుండి మండల కేంద్రం రాయపోల్ వయా రాయపోల్ మీదుగా జిల్లా కేంద్రశీ సిద్దిపేటకు బస్సు సౌకర్యం కల్పించాలని రాయపోలు మండల ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్రం సిద్దిపేటకు వెళ్లేందుకు సరైన నేరుగా బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రస్తుతం సిద్దిపేటకు వెళ్లాలంటే గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మార్గం మీదుగా తిరిగి ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో సమయం, ఖర్చు రెండూ పెరుగుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. ద్విచక్ర వాహనదారులు రాయపోల్--అనాజీపూర్--మంతూర్--వెంకట్రావుపేట్ మార్గం ద్వారా సిద్దిపేటకు చేరుకుంటున్నారు. అదేవిధంగా అనాజీపూర్, మంతూర్ గ్రామాల ప్రజలు మండల కేంద్రం రాయపోల్‌కు రావాలంటే సరైన రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర అవసరాల కోసం కూడా కాలినడకన లేదా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో గజ్వేల్--ప్రజ్ఞాపూర్ డిపో నుండి రోజుకు కనీసం రెండు బస్సులను రాయపోల్--అనాజీపూర్--మంతూర్--వెంకట్రావుపేట్ మార్గం ద్వారా సిద్దిపేట జిల్లా కేంద్రానికి నడిపితే ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని స్థానికులు కోరుతున్నారు. మెదక్ ఎంపీ,. దుబ్బాక ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి ఈ సమస్యను వెంటనే పరిష్కరించి సిద్దిపేటకు నేరుగా బస్సు సౌకర్యం కల్పించాలని రాయపోల్ మండల ప్రజలు బలంగా విజ్ఞప్తి చేస్తున్నారు.

**బస్సు సౌకర్యం కల్పించాలి. కిషన్ రావు పంతులు మంతూరు ....** “సిద్దిపేటకు నేరుగా బస్సు సౌకర్యం లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. గజ్వేల్ మీదుగా వెళ్లాల్సి రావడం వల్ల సమయం, ఖర్చు పెరుగుతున్నాయి. రాయ-పోల్--అనాజీపూర్--మంతూర్ మార్గంలో బస్సులు నడిపితే మా గ్రామ ప్రజలకు ఎంతో సౌలభ్యం కలుగుతుంది. అధికారులు వెంటనే స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలి.




## వీడియో క్లిప్పింగ్ లతో రోడ్డు భద్రతపై చైతన్యం

- నారాయణపేట సిఐ శివశంకర్

**నారాయణపేట, ఏప్రిల్,15 :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని సాం ఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై వీడియో క్లిప్పింగ్ లతో నారాయణపేట సిఐ శివశంకర్ మరియు టౌన్ ఎస్సై వెం కటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో జరిగిన రోడ్డు ప్రమా దాలను వీడియో రూపంలో విద్యార్థులకు చూపించి, ప్రమాదాలు ఎలా జరుగుతాయో కళ్లకు కట్టినట్లు వివరిస్తూ అవగాహన కల్పించారు. ఈ వీడియోలు విద్యార్థుల్లో చైతన్యం కలిగించేలా ఉండి, రోడ్డు భద్రతపై వారికి స్పష్టమైన అవగాహనను అందించాయి. ఈ సందర్భంగా సిఐ శివశంకర్, టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు ప్రధానంగా నిర్లక్ష్యం మరియు ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడం వల్లనే జరు గుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా:మితిమీరిన వేగంతో వాహనం నడపడం హె ల్మె ట్, సీట్ బెల్ట్ ఉపయోగించకపోవడం మద్యం సేవించి డ్రైవింగ్ చేయడంమొబైల్ ఫో న్ ఉపయోగిస్తూ వాహనం నడపడం రాంగ్ సైడ్ డ్రైవింగ్, ఓవర్‌టేకింగ్‌లో జాగ్రత్తలు పాటించకపోవడం ట్రాఫిక్ సిగ్నల్స్, రూల్స్‌ను పట్టించుకోకపోవడం వంటి కారణాల వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. అలాగే ప్రమాదాల నుండి రక్షణ పొందడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా వివరించారు: ఎల్లప్పుడూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ వేసుకోవడం వేగ పరిమితిని పాటించడం డ్రైవింగ్ సమయంలో మొబైల్ వినియోగం పూర్తిగా నివారించడం మద్యం సేవించి వాహనం నడపకపోవడం రోడ్డు దాటేటప్పుడు జీబ్రా క్రాసింగ్ ఉపయోగించడం విద్యార్థులు రోడ్డు భద్రతపై అవగాహన కలిగి తమ కుటుంబ సభ్యులకు, సమాజానికి ఈ సందేశాన్ని చేరవేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తేనే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. ఎస్సై 2 గాయత్రి, టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబంది పాల్గొన్నారు.




## విద్యార్థులు ట్రాఫిక్ నియమాలపై సమాజంలో చైతన్యం కలిగించాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.
- అరైవ్ అలైవ్ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా మానవహారం.

**నిర్మల్ ఏప్రిల్15 :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అరైవ్ అలైవ్ వారోత్సవాలు జిల్లాలో విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఈ అరైవ్ అలైవ్ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం పట్టణంలో జయశంకర్ చౌరస్తా సమీపంలో విద్యార్థులచే భారీ మానవహారం నిర్వహించారు. ఈ మానవహారం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో కళాజాత బృందాలు తమ పాటల ద్వారా ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచి పిల్లలందరూ ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. జిల్లాలో పాఠశాలల విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగించేలా సంబంధిత అధికారులతో కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పాఠశాలలలో విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని అన్నారు. విద్యార్థులే రోడ్డు భద్రత నియమాలపై ప్రచారానికి బ్రాండ్ అంబాసిడర్ లు అని, పిల్లలు మంచి విషయాలు చెబితే ప్రతి ఒక్కరు తప్పకుండా వింటారని అన్నారు. విద్యార్థులు తమ ఇండ్లలో తల్లిదండ్రులకు, సమాజంలోని వ్యక్తులకు ట్రాఫిక్ నియమాల గురించి చైతన్యం కలిగించాలన్నారు. తమ కుటుంబ సభ్యులు వాహనాలలో బయటకు వెళ్ళినప్పుడు, హెల్మెట్, సీట్ బెల్ట్, డ్రంక్ అండ్ డ్రైవ్, అతివేగం వంటి రోడ్డు భద్రత విషయాలపై వివరించాలని తెలిపారు. విద్యార్థులు ఎవరు తగిన వయస్సు లేనిదే వాహనాలను నడుపరాదని సూచించారు. పలువురు విద్యార్థులు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగించేలా ఉపన్యాసాలు ఇచ్చారు. కలెక్టర్, అధికారులు, విద్యార్థులతో కలిసి రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేశారు. ఈ మానవహారం లో సీపీఓ జీవరత్నం, డీఈవో భోజన్న, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, ఎంవిఐ మహేందర్, వివిధ పాఠశాలల విద్యార్థులు, ఎన్ సి సి విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కొడంగల్ బస్టాండ్ లో అవగాహన కల్పించిన -SFO పి ప్రభాకర్



**కొడంగల్ మున్సిపల్ ,ఏప్రిల్ 15 :** బుధవారం కొడంగల్ పట్టణ కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఆర్టీసీ బస్టాండ్ లో అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు మరియు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సత్వర అప్రమత్తత గూర్చి ప్రజలకు (ప్రయా ణికులకు) వివరించడం జరిగింది . ఒకవేళ అగ్ని ప్రమాదం జరిగితే ఫైర్ ఎక్స్టిన్విషర్స్ ని ఎలా వాడాలో వివరంగా చూపించడం జరిగింది. అగ్ని ప్రమాదానికి ముందు తీసు కోవాల్సిన జాగ్రత్తలను అలాగే వంట గ్యాస్ వినియెగించే సమయంలో జరిగే ప్రమాదాల గురించి ముందస్తు జాగ్రత్తలు తగు సూచనలు ప్రమాదాల నివారణ ప్రమా దం జరిగిన వెంటనే కాపాడే విధంగా ప్రమాదం జరిగిన వెంటనే తమకు తాము రక్షిం చుకునే వి ధంగా వారికి తగు సూచనలు మరియు జాగ్రతలపై తమ సిబ్బంది తో కసలి అవ గాహన కల్పించినట్లు కొడంగల్ అగ్నిమాపక అధికారి (ఎస్.ఎఫ్.ఓ) పి ప్రభాకర్ తెలిపారు.

## రోడ్డు భద్రతపై మైనర్ డ్రైవింగ్ పై స్పెషల్ డ్రైవ్: సీఐ శివశంకర్.

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ఆదేశాల మేరకు ...
- ఎస్సై వెంకటేశ్వర్లు,ఎస్సై కృష్ణ చైతన్య, ఎస్సై గాయత్రి.2



**నారాయణపేట,ఏప్రిల్,15 :** “అరైవ్ అలైవ్” కార్యక్రమంలో భాగంగా బుధవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో నారాయణపేట పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి మైనర్ డ్రైవింగ్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కఠిన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మైనర్‌గా వాహనాలు నడుపుతున్న మొత్తం 16 మందిని గుర్తించి పట్టుకొని, వారికి కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సీఐ శివశంకర్, ఎస్సై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ....చట్టపరంగా 18 సంవత్సరాలు నిండకముందు వాహనాలు నడపడం నేరమని తెలిపారు. మైనర్లు వాహనాలు నడపడం వల్ల వారి ప్రాణాలకు మాత్రమే కాకుండా ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం కలుగుతుందని హెచ్చరించారు. “మైనర్ డ్రైవింగ్ అనేది చిన్న తప్పు కాదు... అది ప్రాణాలపై ప్రమాదం. తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలి” అని సీఐ శివశంకర్ అన్నారు. “డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం చట్ట విరుద్ధం. నియమాలు పాటించడం ద్వారా మాత్రమే ప్రమాదాలను నివారించగలం” అని ఎస్సై వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మళ్ళీ ఎవరైనా మైనర్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే సంబంధిత వాహనాలను సీజ్ చేయడంతో పాటు, తల్లిదండ్రులపై కూడా చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ముఖ్యంగా యువత ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగించడం వంటి భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. “అరైవ్ అలైవ్” కార్యక్రమం లక్ష్యం -- ప్రతి ఒక్కరు సురక్షితంగా గమ్యానికి చేరుకోవడం. రోడ్డు ప్రమాదాలు పూర్తిగా తగ్గించడమే మా ధ్యేయం” అని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య, ఎస్సై 2 గాయత్రి, పోలీస్ సిబ్బంది, స్థానిక పాల్గొన్నారు.

## విద్యార్థులతో రోడ్డు భద్రతపై మానవహారం

- రూరల్ ఎస్సై సతీష్ రెడ్డి
- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ఆదేశాల మేరకు




**నారాయణపేట, ఏప్రిల్,15 :** నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో “అరైవ్ అలైవ్” కార్యక్రమంలో భాగంగా ఆపాక్ పల్లి చౌరస్తా మరియు జాజాపూర్ పాఠశాలలో రూరల్ ఎస్సై సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి రోడ్డు భద్రతపై మానవహారం ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు తమ తల్లిదండ్రులకు రోడ్డు భద్రతా నియమాలు పాటించాల్సిన అవసరాన్ని వివరించే లేఖలు రాయించారు. ఆ లేఖలను ఇంటికి తీసుకెళ్లి తల్లిదండ్రులకు అందజేయాలని ఎస్సై గారు సూచించారు. ఈ సందర్భంగా ఎస్సై సతీష్ రెడ్డి మాట్లాడుతూ...రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజల అవగాహన ఎంతో కీలకమని, ముఖ్యంగా యువత మరియు విద్యార్థులు ముందుకు వచ్చి సమాజంలో మార్పు తీసుకురావాలని తెలిపారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగం, మితిమీరిన వేగం వద్దు, మద్యం తాగి వాహనం నడపకూడదని స్పష్టం చేశారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు, పరిసరాల వారికి రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని చెప్పారు. రక్తపు చారలు లేని రోడ్లే మన లక్ష్యం -- రోడ్డు భద్రత మనందరి బాధ్యత అని తెలిపారు. చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తుందని, కాబట్టి ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు మరియు పోలీసులు పాల్గొన్నారు.



# జాతీయ హాకీ శిబిరానికి తెలంగాణ ప్లేయర్లు

**హైదరాబాద్ :** జాతీయ హాకీ శిబిరానికి రాష్ట్రానికి చెందిన హర్ష్‌కుమార్, వీణ ఎంపికయ్యారు. రాంచీ వేదికగా ఇటీవల ముగిసిన జాతీయ సబ్‌జూనియర్ హాకీ టోర్నీలో మెరుగైన ప్రదర్శన కనబరిచిన హర్ష్‌కుమార్, వీణ భోపాల్ సాయ్ సెంటర్‌లో శిక్షణ పొందనున్నారు. ఈనెల 19 నుంచి మొదలయ్యే క్యాంప్ ద్వారా అండర్-18 జూనియర్ ఆసియా కప్ టోర్నీకి భారత జట్లను ఎంపిక చేయనున్నారు. వచ్చే నెల 29 నుంచి జూన్ 6వ తేదీ వరకు జపాన్ వేదికగా ఆసియా కప్ హాకీ టోర్నీ జరుగనుంది.




# అజింక్య రహానేకు 12 లక్షల జరిమానా

**చెన్నై:** కోల్‌కతా నైట్ రైడర్స్ కెప్టెన్ అజింక్య రహానే కు ఫైన్ పడింది. అతనికి 12 లక్షల జరిమానా విధించారు. ఐపీఎల్‌లో మంగళవారం చెన్నై సూపర్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా అతనికి ఫైన్ వేశారు. ఈ సీజన్‌లో కోల్‌కతా పర్ఫార్మెన్స్ మరీ దారుణంగా ఉంది. ఇప్పటి వరకు ఆ జట్టు ఒక్క మ్యాచ్ కూడా గెలవలేదు. చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో 32 రన్స్ తేడాతో కోల్‌కతా ఓటమి పాలైంది. టాటా ఐపీఎల్‌లో భాగంగా జరిగిన 22వ మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా రహానేకు ఫైన్ వేసినట్లు ఐపీఎల్ మీడియా అడ్వైజరీ ఓ ప్రకటనలో చెప్పింది. ఈ సీజన్‌లో ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 కింద తొలిసారి నేరంగా పరిగణిస్తూ ఆ ఫైన్ వేసినట్లు చెప్పారు. శుక్రవారం గుజరాత్ టైటాన్స్‌తో తన తదుపరి మ్యాచ్ కోల్‌కతా ఆడనున్నది.

# ముంబై ఇండియన్స్‌కు 'హిట్ మ్యాన్' షాక్!

## గాయంతో రెండు మ్యాచ్‌లకు రోహిత్ దూరం



**ముంబై:** ఐపీఎల్ 2026 సీజన్‌లో ఇప్పటికే వరుస ఓటములతో సతమతమవుతున్న ముంబై ఇండియన్స్ జట్టుకు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు సీనియర్ బ్యాటర్, మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ గాయం కారణంగా రాబోయే కనీసం రెండు మ్యాచ్‌లకు అందుబాటులో ఉండటం లేదని సమాచారం. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన ఉత్కంఠభరిత పోరులో రోహిత్ కండరాలు పట్టేయడంతో తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఫిజియోలు ప్రాథమిక చికిత్స అందించినప్పటికీ నొప్పి తగ్గకపోవడంతో ఆయన 'రిటైర్డ్ హర్ట్'గా వెనుదిరగాల్సి వచ్చింది. స్కానింగ్ నివేదికల అనంతరం, వైద్యుల సూచన మేరకు మేనేజ్‌మెంట్ ఆయనకు విశ్రాంతిని ప్రకటించింది. ఐపీఎల్ ముగిసిన వెంటనే భారత జట్టు అంతర్జాతీయ సిరీస్‌లు ఆడాల్సి ఉండటంతో, రోహిత్ గాయంపై బీసీసీఐ కూడా దృష్టి సారించింది. రోహిత్ గాయం తీవ్రత పెరగకుండా చూడాలని, త్వరగా కోలుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని ముంబయి ఫిజియోలకు బోర్డు సూచించినట్లు తెలుస్తోంది. బీసీసీఐ వైద్య బృందం నిరంతరం రోహిత్ ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తోంది. మరోవైపు సోషల్ మీడియా వేదికగా రోహిత్ శర్మ త్వరగా కోలుకుని క్రీజులోకి రావాలని క్రికెట్ అభిమానులు ప్రార్థిస్తున్నారు. రోహిత్ లేని లోటును ముంబయి ఇండియన్స్ ఎలా భర్తీ చేస్తుందో తదుపరి

# బెంగళూరు భళా!



## రాయల్ ఛాలెంజర్స్ గెలుపు మోత

**లక్నో సూపర్ జెయింట్స్ పై 5 వికెట్ల తేడాతో ఘన విజయం**

**బంతితో చెలరేగిన రసిఖ్ సలామ్, భువనేశ్వర్ కుమార్**

**బ్యాట్ తో అదరగొట్టిన విరాట్ కోహ్లీ, రజత్ పాటిదార్**

**29 బంతులు మిగిలి ఉండగానే లక్ష్య ఛేదన**

**బెంగళూరు :** ఐపీఎల్ టోర్నీలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అదరగొట్టింది. తమ సొంత గడ్డ చిన్నస్వామి స్టేడియం వేదికగా బుధవారం జరిగిన మ్యాచ్ లో లక్నో సూపర్ జెయింట్స్ పై 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో సమష్టిగా రాణించి ప్రత్యర్థిని చిత్తు చేసింది. పక్కా వ్యూహంతో బరిలోకి దిగిన బెంగళూరు బౌలర్లు ముందుగా లక్నోను సాధారణ స్కోరుకే పరిమితం చేయగా.. ఆ తర్వాత బ్యాటర్లు ఆ లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించారు. రన్ రేట్ మెరుగుపరుచుకోవాలన్న కసితో ఆడిన బెంగళూరు జట్టు మరో 29 బంతులు మిగిలి ఉండగానే ఆటను ముగించడం విశేషం.

### రాణించిన రసిఖ్, భువీ

ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన బెంగళూరు జట్టు బౌలింగ్ ఎంచుకుంది. దీంతో మొదట బ్యాటింగ్ కు దిగిన లక్నో జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 146 పరుగులు మాత్రమే చేయగలిగింది. లక్నో బ్యాటర్లలో మిచెల్ మార్ష్ 32 బంతుల్లో 40 పరుగులు, ముకుల్ చౌదరి 28 బంతుల్లో 39 పరుగులు, ఆయుష్ బదోని 24 బంతుల్లో 38 పరుగులతో ఫర్వాలేదనిపించారు. వీరు క్రీజులో కుదురుకున్నట్లే కనిపించినా భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. బెంగళూరు బౌలర్లు కచ్చితమైన లైన్ లెంగ్త్ తో బంతులు విసరడంతో లక్నో బ్యాటర్లు భారీ షాట్లకు ఇబ్బంది పడ్డారు. ముఖ్యంగా యువ బౌలర్ రసిఖ్ సలామ్ కేవలం 24 పరుగులిచ్చి 4 కీలక వికెట్లు తీసి లక్నో పతనాన్ని శాసించాడు. అతనికి తోడుగా సీనియర్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ 3 వికెట్లతో చెలరేగాడు. కృనాల్ పాండ్యా 2 వికెట్లు పడగొట్టి లక్నోను కట్టడి చేశారు.

### విరాట్ కోహ్లీ మెరుపులు.. పాటిదార్ సుడిగాలి

అనంతరం 147 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బెంగళూరు జట్టు కేవలం 15.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 149 పరుగులు చేసి లక్ష్యాన్ని ముద్దాడింది. ఓపెనర్ విరాట్ కోహ్లీ 34 బంతుల్లో 49 పరుగులు చేసి తృటిలో హాఫ్ సెంచరీ చేజార్చుకున్నాడు. అతడి బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ జట్టు విజయానికి గట్టి పునాది వేసింది. మిడిలార్డర్ లో రజత్ పాటిదార్ కేవలం 13 బంతుల్లో 27 పరుగులు చేసి స్కోరు బోర్డును ఉరుకులు పెట్టించాడు. చివర్లో జితేష్ శర్మ 9 బంతుల్లో 23 పరుగులతో విరుచుకుపడి జట్టుకు అద్భుత విజయాన్ని అందించాడు. లక్నో బౌలర్లలో ప్రిన్స్ యాదవ్ 3 వికెట్లు తీసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అవేష్ ఖాన్ 2 వికెట్లు పడగొట్టాడు. పిచ్ పరిస్థితులను ముందే అంచనా వేసిన బెంగళూరు సారథి బౌలింగ్ ఎంచుకుని సగం విజయాన్ని అక్కడే ఖాయం చేసుకున్నాడు. పవర్ ప్లేలో పరుగులు కట్టడి చేయడంతో పాటు లక్నో బ్యాటర్లను ఒత్తిడిలోకి నెట్టడంలో బెంగళూరు బౌలర్లు పూర్తి స్థాయిలో సఫలమయ్యారు. ఛేదనలో కోహ్లీ అనుభవం జట్టుకు ఎంతో అక్కరకొచ్చింది. ఎక్కడా తడబడకుండా లక్ష్యం వైపు దూసుకుపోవడంతో లక్నో బౌలర్లకు ఏమాత్రం అవకాశం దక్కలేదు.









# అంతర్జాతీయ అరంగేట్రం

**ఆ స్టార్ ఆటగాళ్ల టీ20 స్థానం ప్రమాదంలో?**

**ఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ మరోసారి యువ ప్రతిభకు వేదికగా నిలుస్తోంది. ఇటీవల ప్రఫుల్ హింగే, సకిబ్ హుస్సేన్ వంటి కొత్త ఆటగాళ్లు రాణించిన నేపథ్యంలో ఇప్పుడు అందరి దృష్టి యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై పడింది. వరుసగా రెండు ఐపీఎల్ సీజన్లలో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ అరంగేట్రానికి దగ్గరయ్యాడు. కేవలం 12 మ్యాచ్‌ల ఐపీఎల్ కెరీర్ లోనే సూర్యవంశీ 452 పరుగులు సాధించాడు. ఇందులో ఒక సెంచరీ, మూడు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. స్ట్రైక్ రేట్ 228.28 చూస్తే వైభవ్ బౌలర్లపై ఎలా విరుచకపడుతాడో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఈ దూకుడుతో సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించిన వైభవ్, ఐర్లాండ్ పర్యటనకు ఎంపికయ్యే అవకాశాలు బాగా కనిపిస్తున్నాయి. ఇదే నిజమైతే.. కేవలం 15 ఏళ్ల వయసులోనే సూర్యవంశీ టీమ్ ఇండియాలోకి వస్తే, క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ రికార్డును బద్దలు కొట్టి, భారత జట్టుకు ఆడిన అతి పిన్న వయస్కుడిగా రికార్డ్ ను దక్కించుకుంటాడు. టెండూల్కర్ 16 ఏళ్ల వయసులో అరంగేట్రం చేసిన విషయం తెలిసిందే. అయితే, అతని ఎంపికలో ప్రధాన సమస్య టాప్ ఆర్డర్ లో చోటు కల్పించడం. ప్రస్తుతం టీమిండియాకు అభిషేక్ శర్మ, సంజు శాంసన్, ఇషాన్ కిషన్ డ్యాషింగ్ ఓపెనర్లు ఉండనే ఉన్నారు. టీ20 వరల్డ్ కప్ 2026 విజయానంతరం వీరు జట్టుకు మరింత కీలకంగా మారారు. అయితే సాధారణంగా ఐర్లాండ్ పర్యటనలో సీనియర్ ఆటగాళ్లకు విశ్రాంతి ఇచ్చి, కొత్త ఆటగాళ్లను పరీక్షించే అవకాశం బీసీసీఐ తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సీనియర్లకు రెస్ట్ ఇస్తే సూర్యవంశీ ఓపెనర్ గా ఆడే అవకాశం దక్కించుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. దీన్ని బట్టి చూస్తే అతి త్వరలో అభిషేక్ శర్మ, సంజు శాంసన్, ఇషాన్ కిషన్ కెరియర్ లో భారీ మార్పులు రానున్నాయి. చుడాలిమరి సెలెక్టర్లు






# ఫ్రాన్స్ యానిమేషన్ ఫెస్టివల్‌లో యానిమేషన్ బాహుబలి

**భారతీయ చిత్ర పరిశ్రమకు దక్కిన గుర్తింపు అన్న రాజమౌళి**

రాజమౌళి సృష్టించిన 'బాహుబలి' మరో ఘనతను సొంతం చేసుకుంది. ఆయన రూపొందించిన 'బాహుబలి' ఫ్రాంచైజీ నుంచి వస్తున్న సరికొత్త యానిమేషన్ చిత్రం 'బాహుబలి: ద ఎటర్నల్ వార్' . 2027లో ఇది ప్రేక్షకుల ముందుకురానుంది. తాజాగా ఈ చిత్రం ఒక అరుదైన మైలురాయిని చేరుకుంది. ఫ్రాన్స్‌లో జరగనున్న ప్రతిష్టాత్మక ఎన్నెసి యానిమేషన్ ఫెస్టివల్ 2026 లోని 'వర్క్ ఇన్ ప్రోగ్రెస్' విభాగంలో ప్రదర్శనకు అధికారికంగా ఎంపికైంది. దీనిపై రాజమౌళి ఆనందం వ్యక్తంచేశారు. యానిమేషన్ అనేది హద్దులు లేని అద్భుతమైన ప్రపంచమనే విషయాన్ని నేను ఎప్పుడూ నమ్ముతానని ఈ సందర్భంగా అన్నారు. ఇది మన భారతీయ సినిమాకి దక్కిన ఒక అరుదైన గౌరవంగా భావిస్తున్నా. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన యానిమేషన్ వేదికపై ఈ సినిమాను ప్రదర్శించే అవకాశం రావడం మాకెంతో ఆనందంగా ఉ ంది. దీనికోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం అని రాజమౌళి పోస్ట్ పెట్టారు. యానిమేషన్ రంగంలో ఈ ఫెస్టివల్‌ను 'యానిమేషన్ ప్రపంచపు కేన్స్ ఫెస్టివల్'గా పరిగణిస్తారు. భారతీయ యానిమేషన్ సత్తాను ప్రపంచ వేదికపై చాటిచెప్పేందుకు ఇదొక గొప్ప అవకాశంగా సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అమరేంద్ర బాహుబలి మరణం తర్వాత జరిగే పరిణామాల నేపథ్యంలో దీన్ని రూపొందిస్తున్నారు. దాదాపు రూ.120 కోట్ల భారీ బడ్జెట్‌తో 'ఆర్కా మీడియా వర్క్స్' ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.




# సర్ మరో అవకాశం ఇవ్వండి

**బుచ్చిబాబు పోస్ట్.. వైరల్**



ప్రస్తుతం అగ్ర కథానాయకుడు రామ్ చరణ్ పెద్దితో బిజీగా ఉన్నారు. బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న ఈ సినిమా ఏప్రిల్ 30న విడుదల కానుంది. వీరిద్దరి మధ్య ఉన్న సాన్నిహిత్యం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా రామ్‌చరణ్ 'ఎస్క్వైర్ ఇండియా'కు ఇంటర్వ్యూ ఇచ్చిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన వీడియోను ఆయన ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. ఈ ఫోటోల్లో చరణ్ స్టైలిష్ లుక్‌కు అభిమానులు ఫిదా అవుతున్నారు. దీనికి దర్శకుడు బుచ్చిబాబు చేసిన కామెంట్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 'సర్.. మరో అవకాశం ఇవ్వండి' అని సరదాగా కామెంట్ చేశారు. ఈ చిన్న కామెంట్ ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. దీంతో 'పెద్ది' తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో మరో సినిమా రానుందని వార్తలు మొదలయ్యాయి. గ్యాంగ్‌స్టర్ సినిమా తీయమంటూ అభిమానులు కూడా రిప్లైలు పెడుతున్నారు. ప్రస్తుతం ఈ ఇద్దరూ పెద్దిపై పూర్తి ఫోకస్ పెట్టారు. ఇప్పటివరకూ విడుదలైన ఈ సినిమాలోని పాటలు ఆదరణను సొంతం చేసుకోవడంతో దీనిపై అంచనాలు నెలకొన్నాయి.

# అర్ధరాత్రి ఫోన్ చేసి..

**కయాదు లోహర్**

తన అందం, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న కాయాదు లోహర్ తాజాగా ఓ ప్రైవేట్ ఆల్బమ్‌తో మరోసారి వార్తల్లో నిలిచింది. వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఆమె 'పళవ మల్లి' అనే పాటలో నృత్యంతో ఆకట్టుకుంది. 'డ్యూడ్' చిత్రంతో సంగీత దర్శకుడిగా గుర్తింపు పొందిన సాయి అభ్యంకర్ ఈ పాటకు స్వరాలు అందించారు. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ పాటలో అవకాశం ఎలా వచ్చిందో కాయాదు లోహర్ వివరించింది. ఒక రోజు అర్ధరాత్రి సమయంలో సాయి అభ్యంకర్ ఫోన్ చేసి పాట గురించి వివరించారని తెలిపింది. ఆ సమయంలో కాల్ రావడంతో ఆశ్చర్యపోయానని, అనంతరం ఆయన పాట వినిపించగా బాగా నచ్చడంతో వెంటనే అంగీకరించినట్లు చెప్పింది. పాటకు ఒప్పుకోవడం సులభంగా అనిపించినప్పటికీ, దాని కోసం చాలా శ్రమించాల్సి వచ్చిందని వెల్లడించింది. ఒకవైపు రిహార్సల్స్ నిర్వహిస్తూ, మరోవైపు సినిమా షూటింగ్‌లను సమన్వయం చేయాల్సి వచ్చిందని తెలిపింది. కొన్ని సందర్భాల్లో రాత్రి 2 గంటల వరకు చిత్రీకరణ జరిగినట్లు పేర్కొంది. ఈ పాట అద్భుతంగా రావడానికి మొత్తం బృందం కష్టపడిందని, ఆ కృషికి ఫలితంగా ఇప్పుడు ఈ పాటకు మిలియన్లలో వ్యూస్ లభిస్తున్నాయని కాయాదు లోహర్ వివరించింది.



# నన్ను నమ్మి.. నడిపించిన నా దేవత

**భార్య రహస్య గోరఖ్‌పై కిరణ్ ప్రశంసలు**



యువ హీరో కిరణ్ అబ్బవరం ఇప్పుడు నిర్మాతగా కొత్త అవతారంలో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. కేఏ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఆయన సమర్పణలో రూపొందిన 'తిమ్మరాజుపల్లి టీవీ' చిత్రం ఏప్రిల్ 17న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా ద్వారా కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించాలనే లక్ష్యంతో సుమారు 25 మందికి పైగా కొత్త నటీనటులను, దర్శకుడు వి. మునిరాజ్‌ని పరిశ్రమకు పరిచయం చేస్తున్నారు. విభిన్నమైన కథాంశంతో రూపొందిన ఈ చిత్రం ఇప్పటికే ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇటీవల జరిగిన ప్రీ-రిలీజ్ ఈవెంట్ ఎంతో భావోద్వేగభరితంగా సాగింది. ఈ సందర్భంగా కిరణ్ అబ్బవరం చేసిన ప్రసంగం అందరినీ కదిలించింది. 'ఈ సినిమా కేవలం ఒక ప్రాజెక్ట్ కాదు.. పల్లెల నుంచి పెద్ద కలలతో వచ్చిన సుమారు 50 మంది టెక్నీషియన్లు, నటీనటుల జీవిత స్వప్నం' అని ఆయన తెలిపారు. తన కెరీర్‌లో ఇప్పటివరకు ఎవరినీ సహాయం కోరలేదని చెప్పిన కిరణ్, ఈసారి మాత్రం కొత్తవారి కష్టానికి గుర్తింపు రావాలనే ఉద్దేశంతో పరిశ్రమ పెద్దలు, విమర్శకులు ఈ సినిమాను ఆదరించాలని కోరారు. ఈ వేడుకలో ఆయన తన భార్య, నటి రహస్య గోరఖ్ గురించి చేసిన వ్యాఖ్యలు ప్రత్యేకంగా నిలిచాయి. తాను హీరో కాకముందు ఎదుర్కొన్న కష్టాలను గుర్తు చేసుకుంటూ, ఆ సమయంలో రహస్య తనకు అండగా నిలిచిందని చెప్పారు. అవకాశాల కోసం తిరిగిన రోజుల్లో కూడా ఆమె నన్ను నమ్మింది. తినడానికి కూడా కష్టమైన సమయంలో ఇంటి నుండి భోజనం తీసుకువచ్చి నన్ను ఆదుకుంది. నేను హీరో అవుతానని విశ్వసించి నా చేయి పట్టుకుంది అంటూ భావోద్వేగానికి లోనయ్యారు. చిన్న సినిమా అయినప్పటికీ టెక్నికల్ పరంగా ఎక్కడా రాజీ పడలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ చిత్ర బృందం కష్టానికి గుర్తింపుగా, వారి కుటుంబ సభ్యుల కోసం భారతదేశంలోనే అతిపెద్ద స్క్రీన్‌పై స్పెషల్ ప్రీమియర్ ఏర్పాటు చేసునుటు ప్రకటించడం విశేషం.

# విష్ణుప్రియకు కలిసి వచ్చిన నెగెటివ్ ఫీడ్‌బ్యాక్

సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ విష్ణుప్రియ చుట్టూ ఇటీవల ఏర్పడిన వివాదాలు, కేసులు ఆమెకు ఆర్థికంగా లాభం చేకూర్చినట్లు కనిపిస్తున్నాయి. సాధారణంగా వివాదాలు కెరీర్‌పై ప్రభావం చూపుతాయని భావిస్తారు. అయితే విష్ణుప్రియ విషయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా మారినట్లు చర్చ జరుగుతోంది. వివాదాలకు ముందు ఆమెకు సుమారు 1,892 మంది పెయిడ్ సబ్‌స్క్రైబర్లు ఉండగా, ఒక్కో సబ్‌స్క్రిప్షన్ ధర రూ.380గా లెక్కిస్తే నెలకు దాదాపు రూ.7 లక్షల వరకు ఆదాయం వచ్చినట్లు తెలుస్తోంది. అప్పట్లో ఆమె ఫాలోయింగ్ పరిమితంగానే ఉండేది. అయితే కేసులు నమోదైన తర్వాత సోషల్ మీడియాలో ఆమెపై విస్తృత చర్చ జరగడంతో, ఆమె కంటెంట్ చూడాలనే ఆసక్తి నెటిజన్లలో పెరిగింది. దీంతో పెయిడ్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 1,892 నుంచి 4,832కు పెరిగినట్లు సమాచారం. సబ్‌స్క్రైబర్ల సంఖ్య పెరగడంతో ఆదాయం కూడా గణనీయంగా పెరిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె నెలకు రూ.18 లక్షలకుపైగా సంపాదిస్తున్నట్లు అంచనా వేస్తున్నారు. నెగెటివ్ ప్రచారం కూడా కొన్నిసార్లు ఆర్థిక లాభాలకు దోహదపడుతుందని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY **MOHAMMED IMRAN,** PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. **EDITOR : MOHAMMED IMRAN**, RNI. NO. TELTEL/2006/16536